**ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపిన బీఎస్పీ**




**కాళేశ్వరంప్రాజెక్టుపైకూలిన ప్రభుత్వ కుట్రలు**




PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 118 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 25 ఏప్రిల్ 2026

# చర్చలతోనే పరిష్కారం..

## ప్రాణాలు తీసుకోవద్దు: ఆర్టీసీ నేతలతో భట్టి విక్రమార్క

**మంత్రుల బృందంతో జేఏసీ నేతల భేటీ**

**డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన మల్లు భట్టి**

**ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ**

**హైదరాబాద్,ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిపై తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సచివాలయంలో మంత్రుల బృందంతో కలిసి జేఏసీ నేతలతో భేటీ అయిన ఆయన, సమస్యలు ఎంత క్లిష్టమైనా చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని, ప్రాణాలు తీసుకోవడం సరైన నిర్ణయం కాదని హితవు పలికారు. ఇది మనందరి 'ప్రజా ప్రభుత్వం' అని, ఎవరినీ శత్రువులుగా చూసే స్వభావం తమకు లేదని స్పష్టం చేశారు.

మిగతాది 2లో...



# హుగ్లీ నదిలో ప్రధాని విహారం

**బెంగాలీల్లో గంగానదికి ప్రత్యేకత ఉంది**

**ఎక్స్ వేదికగా ఫోటోలు పంచుకున్న మోడీ**



**కోల్‌కతా,ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధాని నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్లో పర్యటిస్తున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని హుగ్లీ నదిలో బోట్ రైడ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా కెమెరాను చేతపట్టి నది అందాలను క్లిక్‌మనిపించారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. హుగ్లీ నది బెంగాల్ సంస్కృతితో ముడిపడి ఉందని మోదీ పేర్కొన్నారు. బెంగాలీల జీవితాల్లో గంగానదికి ఒక ప్రత్యేక స్థానం ఉందని, దాని జలాలు ఒక ప్రాచీన నాగరికత స్ఫూర్తిని మోసుకెళ్తాయన్నారు. ఉదయం హుగ్లీ నది తీరంలో కొంత సమయం

మిగతాది 2లో...

# బీజేపీలోకి రాఘవ్ చద్దా

**ఆమ్ ఆద్మీ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ..**

**మూడింట రెండొంతుల మంది ఆప్ రాజ్యసభ ఎంపీలతో కలిసి బీజేపీలో విలీనం!**

**పార్టీ తన ఆశయాలకు దూరమైందంటూ చద్దా విమర్శలు**

**రాజ్యసభ ఉపనేత పదవి నుంచి తొలగింపే కారణమని ప్రచారం**



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి భారీ రాజకీయ ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు, కీలక నేత, రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా బీజేపీలో చేరనున్నట్లు సంచలన ప్రకటన చేశారు.

మిగతాది 2లో...

# ఆర్టీసీ కార్మికులకు రేవంత్ తీరని ద్రోహం

**రేవంత్ నిర్లక్ష్యమే శంకర్ గౌడ్‌ను బలితీసుకుంది**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్,ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):**
వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసి డ్రైవర్ శంకర్ గౌడ్‌ది ఆత్మహత్య కాదు.. అది ముమ్మాటికీ రేవంత్ సర్కారు చేసిన హత్యే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రెండున్నరేళ్లుగా సీఎం రేవంత్ ఆర్టీసి కార్మికులకు చేస్తున్న తీరని ద్రోహాన్ని తట్టుకోలేకే శంకర్ గౌడ్ బలవన్మరణానికి పాల్పడ్డారని అన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణకు, తోటి కార్మికుల హక్కుల సాధనకు ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ శంకర్ గౌడ్ పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు తీసుకెళ్లి నివాళులు అర్పించేందుకు కూడా అనుమతించకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని కేటీఆర్ మండిపడ్డారు. పు÷-టటెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితోపాటు, బీఆర్ఎస్ నేతలు, ఆర్టీసీ కార్మికులు, కార్మిక సంఘాల నేతలను నర్సంపేటలో అరెస్టుచేయడం చాలా దారుణమని అన్నారు. మిగతాది 2లో...



# ఆర్టీసీ సమ్మెకు బలయిన శంకర్‌గౌడ్

**పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం**

**చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి**

**సిఎం రేవంత్ సంతాపం, మంత్రి పొన్నంల సంతాపం**




**హైదరాబాద్,ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):**
ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అపోలో ఆస్పత్రిలో శంకర్ గౌడ్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తైంది. మిగతాది 2లో...

# మహిళా బిల్లుపై అసెంబ్లీలో చర్చ

**వ్యతిరేకించిన పార్టీల తీరును ఎండగతాం**

**ఎన్‌డిఎ నేతలతో చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్**

**అమరావతి,ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):**
చట్టసభల్లో మహిళ రిజర్వేషన్ బిల్లుపై ఇండియా కూటమి వైఖరిని ప్రజలకు ముఖ్యంగా మహిళలకు వివరించాలని ఎన్డీయే కూటమిలోని పార్టీల నేతలకు సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతిలో ఎన్డీయే నేతలు, ఆయా పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. మహిళ రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీతోపాటు ఇతర భాగస్వామ్య పక్షాల వైఖరిని ప్రజలకు వివరించాలని సీఎం చంద్రబాబును పీవీఎన్ మాధవ్ కోరారు. అందుకు సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. రాబోయే 10 రోజుల్లో మిగతాది 2లో...



# ఏడుగురు ఐపిఎస్‌ల బదిలీలు

**హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్**

**ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి**




# నేడు పార్టీపేరును ప్రకటించనున్న కవిత

**కార్యకర్తల సమక్షంలో జెండా, ఎజెండా వెల్లడి**

**తెలంగాణ ప్రజా జాగృతి అంటూ ప్రచారం**

**హైదరాబాద్,ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):**
తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడుపోసుకుంటుంది. శనివారం కవిత కొత్త పార్టీ ప్రకటించబోతున్నారు. పార్టీ పేరు ప్రకటన విడుదల కాబోతున్నది. శనివరాం ఉదయం 10 గంటలకు.. కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. జెండా, ఎజెండా విడుదల చేయబోతున్నారు. మిగతాది 2లో...



# ప్రజాపాలన ప్రత్యేక కార్యక్రమాలు అమలు

**10 థీమ్ లపై శాఖల వారీగా కార్యక్రమాలు**

**-డ్రగ్స్ అడ్డుకట్టకు పిల్లలు, యువతలో చైతన్యం**

**హైదరాబాద్,ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):**
ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా 10 థీమ్ లతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో విస్తృత స్థాయిలో కార్యక్రమాలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలను ఆయా కార్యక్రమాల్లో భాగస్వాములను చేసి, థీమ్ ల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహిస్తున్న మిగతాది 2లో...



# ఆర్టీసీ సమ్మెకు బలయిన శంకర్‌గౌడ్

(మొదటి పేజీ తరువాయి)

బంధువులకు శంకర్ గౌడ్ మృతదేహాన్ని అప్పగించారు. స్వస్థలానికి శంకర్ గౌడ్ మృతదేహం తరలించారు. గురువారం ఆర్టీసీ డ్రైవర్ పెట్రోల్ పోసుకొని నిప్పంటిచుకున్న విషయం తెలిసిందే. గత రెండ్రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ఈ సమ్మెలో భాగంగా గురువారం రాష్ట్రంలోని అనేక చోట్ల కార్మికులు నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలోనే వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సమ్మెలో పాల్గొన్న శంకర్‌గౌడ్(55) పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆయనను వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే 80 శాతం కాలినగాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. అత్యక్రియలకు ప్రముఖ రాజయకీయ నాయకులు హాజరుకానున్నారు. మరోవైపు.. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ బలవన్మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోబలం కలగాలని ప్రార్థించారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని దు:ఖసాగరంలో ముంచిందని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని, వారి సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేస్తుందని గుర్తు చేశారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఆర్టీసీ కార్మికులు ఆందోళన చెందవద్దని క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

# బీజేపీలోకి రాఘవ్ చద్దా

(మొదటి పేజీ తరువాయి)

తనతో పాటు మూడింట రెండొంతుల మంది ఆప్ రాజ్యసభ సభ్యులు కూడా బీజేపీలో విలీనం కానున్నారని చెప్పడం సంచలనం సృష్టించింది. ఈరోజు ఢిల్లీలో సీనియర్ ఎంపీలు అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్‌లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాఘవ్ చద్దా ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "15 ఏళ్లుగా ఆప్‌కు అంకితభావంతో పనిచేశాను. కానీ ఒకప్పుడు అవినీతి నిర్మూలన నినాదంతో అధికారంలోకి వచ్చిన పార్టీ ఇప్పుడు నిజాయతీ రాజకీయాలకు దూరమైంది. నేను సరైన వ్యక్తినే, కానీ తప్పుడు పార్టీలో ఉన్నాను. అందుకే పార్టీకి దూరమై ప్రజలకు దగ్గరవుతున్నాను" అని వ్యాఖ్యానించారు. ఆప్‌కు రాజ్యసభలో మొత్తం 10 మంది సభ్యులు ఉండగా, వారిలో మూడింట రెండొంతుల మంది తనతో పాటు బీజేపీ వైపు వస్తున్నారని చద్దా పేర్కొన్నారు. వీరిలో ప్రముఖ క్రీడాకారుడు హర్భజన్ సింగ్, స్వాతి మాలివాల్ వంటి వారు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా పార్టీలో రాఘవ్ చద్దా అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఆయన్ను రాజ్యసభలో ఆప్ ఉప నాయకుడి పదవి నుంచి తొలగించి, ఆ స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించారు. ఈ పరిణామం పార్టీ అంతర్గత విభేదాలను బహిర్గతం చేసింది. ఈ నేపథ్యంలోనే చద్దా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇప్పటికే పలు సవాళ్లను ఎదుర్కొంటున్న కేజ్రీవాల్ నాయకత్వానికి ఈ పరిణామం మరింత ఇబ్బందికరంగా మారింది.

# మహిళా బిల్లుపై అసెంబ్లీలో చర్చ

(మొదటి పేజీ తరువాయి)

ఏపీ అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ సమావేశాల వేదికగా 'ఈ అంశం' పై చర్చిద్దామన్నారు. మహిళ రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ మినహా అన్ని పక్షాలు సమర్థించాయని ఆయన గుర్తు చేశారు. మహిళ రిజర్వేషన్ బిల్లును మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని వివరించారు. 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై మోదీ ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. ఉాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఒక కమిటీని నియమించినట్లు సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జనసేన పార్టీ నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ కమిటీలో ఉంటారని పేర్కొన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. ఇప్పటికే నిడదవోలులో నిరసన ర్యాలీ నిర్వహించిన విషయాన్ని పీవీఎన్ మాధవ్ ప్రస్తావించారు. ప్రతి ఎమ్మెల్యే.. తన అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రెస్ మీట్ పెట్టి ఈ అంశాన్ని వివరించాలని నేతలకు సూచించారు. అదే విధంగా త్వరలో ఆ అంశాన్ని ప్రజలకు వివరించేందుకు మూడు ప్రాంతాలు.. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో బహిరంగ సభలు ఏర్పాటు చేయాలని ఈ టెలి కాన్ఫరెన్స్‌లో కూటమి నేతలు నిర్ణయించారు.

# హుగ్లీ నదిలో ప్రధాని విహారం

(మొదటి పేజీ తరువాయి)



గడిపినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో నదిలో పడవ నడిపేవారితో పాటు, ఉదయపు నడకకు వచ్చిన వారితో కాసేపు ముచ్చటించినట్లు తెలిపారు. పడవ నడిపేవారి శ్రామిక శక్తిని ఈసందర్భంగా మోదీ కొనియాడారు. ఎన్నికల్లో గెలిపిస్తే.. పశ్చిమ బెంగాల్ అభివృద్ధికి, ప్రజల శ్రేయస్సు కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హుగ్లీ నది ఒడ్డున తాను వెచ్చించిన సమయం చాలా ప్రత్యేకమైనదని మోదీ మరో పోస్టులో పేర్కొన్నారు. చరిత్రాత్మక విద్యాసాగర సేతు, హావ్‌డా వంతెనను దగ్గరగా చూడటం ఆనందంగా ఉందన్నారు.

# ఏడుగురు ఐపిఎస్‌ల బదిలీలు

### హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్

### ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి

**హైదరాబాద్,ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):**
రాష్ట్రంలో ఏడుగురు సీనియర్ ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీఎస్ రామకృష్ణా రావు ఉత్తర్వులు జారీ చేశారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్ నియమితులయ్యారు. విజిలెన్స్ డీజీగా డీఎస్ చౌహాన్ బదిలీ అయ్యారు. మల్టిజోన్ 2 ఐజీగా షానవాజ్ ఖాసిం నియిమితులయ్యారు. ఆయన పోలీసు పర్సనల్ ఐజీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి నియమితులయ్యారు. డ్రగ్స్ కంట్రోల్ డీజీగా అవినాష్ మొహంతిని నియమిస్తూ, ఆయనకు ఏసీబీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇకపోతే మల్కాజిగిరి పోలీసు కమిషనర్‌గా బి.సుమతి, ఐజీ కార్తికేయకు ఎస్ఐబీ ఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

# ఆర్టీసీ కార్మికులకు రేవంత్ తీరని ద్రోహం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో అక్రమంగా అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయడంతోపాటు, శంకర్ గౌడ్ కుటుంబసభ్యులు, ఆర్టీసి కార్మికుల విజ్ఞప్తిమేరకు ఆర్టీసి డిపో వద్ద నివాళులు అర్పించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు రాక్షసత్వం వల్ల కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అలాగే శంకర్ గౌడ్ గారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అన్నివిధాలా ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నా, కనీసం సోయి లేని సర్కారు అంతులేని నిర్లక్ష్యం వల్లే ఇవాళ ఉద్యమం నాటి దృశ్యాలు, ఆత్మబలిదానాలు చేసుకునే పరిస్థితులు చూస్తున్నామని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల వేళ సవాలక్ష హామీలిచ్చిన రేవంత్ రెడ్డి కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా ఇప్పటికీ నెరవేర్చకపోవడంతోనే ఆర్టీసీ కార్మిక లోకం ఇవాళ తీవ్ర నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతోందని కేటీఆర్ అన్నారు. ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్రలను ఇకనైనా మానుకుని ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి, ఇచ్చిన హామీలను, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. రాష్ట్రంలో ఒకేరోజు ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లు ఆత్మహత్య ప్రయత్నాలు చేసిన సంఘటన తెలంగాణ చరిత్రలో ఓ చీకటి రోజుగా మిగిలి ఉంటుందని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో ఏకకాలంలో ఇన్ని బాధాకరమైన సంఘటనలు జరిగినా మానవత్వం లేని కాంగ్రెస్ సర్కారులో కనీసం చలనం లేకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఆర్టీసీ కార్మిక సోదరుల్లారా.. దయచేసి మనోధైర్యాన్ని కోల్పోకండి. మీ పోరాటాలకు బీఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ నిరంకుశ కాంగ్రెస్ సర్కారు, ఈ అసమర్థ ముఖ్యమంత్రి మెడలు వంచి ఆర్టీసీ కార్మికుల న్యాయమైన హక్కులను సాధించే వరకూ మనమంతా కలిసి సంఘటితంగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు.

------------------

# నేడు పార్టీపేరును ప్రకటించనున్న కవిత

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు కాబోతున్నది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, కామ్రేడ్ పార్టీలకు ధీటుగా పోరాటానికి సిద్ధం అవుతున్న కవిత పార్టీ ప్రకటన ఎలా ఉండబోతుంది అనేది ఉత్కంఠ రేపుతోంది. కవిత పార్టీకి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ అద్వయ కన్వెన్షన్ సెంటర్ వేదికగా బహిరంగ సభలో కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. ఈ సభకు సుమారు 30 వేల మంది జన సమీకరణ చేస్తున్నట్లు జాగృతి శ్రేణులు తెలిపారు .మేడ్చల్ సభలోనే కవిత పార్టీ పేరు జెండా, ఎజెండాను ప్రకటించనున్నారు. కవిత పార్టీ పేరు 'తెలంగాణ ప్రజా జాగృతి', 'తెలంగాణ ప్రజా వికాస సమితి' అంటూ జోరుగా ప్రాచారం సాగుతోంది. ఈమేరకు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులతో కవిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. తెలంగాణ జాగృతి పేరుతోనే ఇప్పటికే చేరికలు ప్రారంభమయ్యాయి. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాబురావు, పలువురు కార్యకర్తలు కవిత సమక్షంలో పార్టీలో చేరారు. జాగృతి జనం బాట కార్యక్రమంతో పార్టీకి సంబంధించిన గ్రౌండ్ వర్క్‌ను ఆమె పూర్తి చేశారు. అటు అధికార పార్టీ కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ పార్టీ నీ ,మరోవైపు బిజెపిని టార్గెట్ చేస్తూ కామెంట్స్ చేస్తున్నారు కవిత. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు కవిత. కవిత పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాంది పలకనున్నారు. ఇంటిపార్టీతో బంధం తెంచుకున్న ఆమె తెలంగాణ రాజకీయాల్లో కొత్త జెండా పాతబోతున్నారు. తనకున్న పరిచయాలు, వాక్చాతుర్యంతో ఆమె ముందుకు నడవాలని చూస్తున్నారు. ప్రధానంగా మహిళలను, ఎస్సీ, బిసి వర్గాలను అక్కున చేర్చుకోవడం ద్వారా పార్టీని బలోపేతం చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# ప్రజాపాలన ప్రత్యేక కార్యక్రమాలు అమలు

(మొదటి పేజీ తరువాయి)

99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో ఇప్పటివరకు పరిశుభ్రత-ఫైళ్ల పరిష్కారం, ఆరోగ్యం, ఆరైవ్- ఆలైవ్ కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. ఈ నెల 26 వరకు సంక్షేమం పై కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 27 నుండి మే నెల 2 వ తేదీ వరకు పిల్లల భద్రత లో భాగంగా డ్రగ్స్ కు అడ్డుకట్ట వేయుటకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై విద్యార్థులు, యువత, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. మే 4 నుంచి 10 వరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, రెవెన్యూ, విద్యుత్, నీటి పారుదల అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అభివృద్ధికి విద్య దిక్సూచిగా నిలుస్తుందనే సంకల్పంతో మే నెల 11 నుంచి 16 వరకు విద్య యొక్క ప్రాధాన్యత, ప్రామాణిక విద్యను అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పై విద్యార్థులు, తల్లిదండ్రులను చైతన్య వంతం చేస్తారు.

ఆరోగ్య వంతమైన తెలంగాణ నిర్మాణంలో యువత కీలకపాత్ర పోషిస్తుంది.

అందులో భాగంగా క్రీడలకు ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతుల ను ఎలా సద్వినియోగం చేసుకోవాలో స్పష్టం చేసేందుకు మే 18 నుంచి 23 వరకు క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అలాగే మే 25 నుంచి 30 వరకు రాష్ట్రంలో ఒక కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయుటకు చేపట్టిన పథకా లపై కార్యక్రమాలు నిర్వహిస్తారు.

జూన్ 1 నుంచి 12 వరకు పర్యావరణం థీమ్ పై కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని , అభివృ ద్ధి సంక్షేమ పథకాల అమలులో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచుటకు ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమనీ ను ప్రభుత్వం నిర్వహిస్తున్నది.

# చర్చలతోనే పరిష్కారం..

(మొదటి పేజీ తరువాయి)

గత పదేళ్లలో ఆర్టీసీ చిన్నాభిన్నమైందని, అప్పట్లో కార్మికుల పట్ల పాలకులు కఠినంగా వ్యవహరించారని అన్నారు. తాము అలా చేయబోమని భరోసా ఇచ్చారు.

వివిధ రాష్ట్రాల ఎన్నికల ప్రచారం, ఇతర ప్రభుత్వ పనుల వల్ల తాము బిజీగా ఉన్న సమయంలో అకస్మాత్తుగా సమ్మె నిర్ణయం తీసుకోవడం వల్లే శంకర్ గౌడ్ ను కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీని బలోపేతం చేసి, కార్మికుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె మూడవ రోజుకు చేరుకుంది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీ అయింది. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ భేటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, ప్రత్యేక సీఎస్ వికాస్ రాజ్ కూడా హాజరయ్యారు.

వరంగల్ జిల్లా నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మంత్రులు, జేఏసీ నేతలు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మంత్రులు భరోసా ఇచ్చారు. ఏ కార్మికుడు కూడా ఆవేశంతో అనాలోచిత నిర్ణయం తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటిని తక్షణమే అమలు చేయాలని జేఏసీ నేతలు పట్టుబట్టారు.

కార్మికులు లేవనెత్తిన 32 డిమాండ్లలో 29 అంశాలకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రులు తెలిపారు. మిగిలిన మూడు అంశాలపై అధ్యయనం కోసం కొంత సమయం కావాలని అన్నారు. అయితే ఏయే డిమాండ్లు ఎప్పటిలోగా అమలు చేస్తారో లిఖితపూర్వక హామీ ఇవ్వాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు.

**శంకర్ గౌడ్ కుటుంబానికి రూ.10 లక్షలు, ఉద్యోగం**

ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం ప్రకటించింది. స్థానిక ఆర్డీవో ఉమారాణి ఆయన మృతదేహానికి ఈరోజు నివాళులర్పించారు. అనంతరం ఈ ప్రకటన చేశారు. పరిహారంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఆర్టీసీలో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు, నర్సంపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి వ్యక్తిగతంగా రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు ప్రకటించారు.

# నర్సంపేటకు వెళుతుండగా, సబితా ఇంద్రారెడ్డి, వినోద్ కుమార్ అరెస్టు

**అరెస్టు చేసి రఘునాథపల్లి స్టేషన్‌కు తరలించిన పోలీసులు**

**పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు**

**ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు**

**నర్సంపేట,ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):**
వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్యాయత్నం చేసి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. శంకర్ గౌడ్ మృతదేహానికి నివాళులర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళుతున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో అరెస్టు చేశారు. మాజీ మంత్రి సబితా



ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీ వినోద్ కుమార్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారిని రఘునాథపల్లి పోలీసులు అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్‌కు పెద్ద ఎత్తున చేరుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నర్సంపేట వెళుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను స్టేషన్ ఘనపూర్ పోలీసులు మార్గమధ్యంలో ఆపి, అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా, నర్సంపేటలో శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపో వరకు తీసుకువెళ్లడానికి కార్మికులు ప్రయత్నించారు. డిపో వద్ద ఆయనకు నివాళులు అర్పిస్తామని వారు తెలిపారు. అయితే అందుకు పోలీసులు నిరాకరించారు. దీంతో పోలీసులు, కార్మికుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపోకు తరలించి, కార్మికులు ఆయనను కడసారిగా చూసి నివాళులు అర్పిస్తామని చెబుతుంటే పోలీసులకు వచ్చిన ఇబ్బంది ఏమిటని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఆయన వరంగల్ పోలీస్ కమిషనర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులు, కార్మికుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

# పరకాల మండలం చేనేత సహకార సంఘాల ఎన్నికల ఓటరు జాబితాలో అక్రమాలు

### దాసరి బిక్షపతి ఆరోపణలు

**పిసిడబ్ల్యూ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి:** పరకాల మండలంలో చేనేత సహకార సంఘాల ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితా తయారీలో తీవ్ర అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని పరకాల మండల పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు దాసరి బిక్షపతి ఆరోపించారు. హన్మకొండ జిల్లా జౌళి శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, పారదర్శకత లేకుండా ఓటరు జాబితా రూపొందిస్తున్నారని విమర్శించారు.ఏప్రిల్ 18 నుండి 25 వరకు చేనేత కార్మికుల ఓటరు జాబితాను సంబంధిత సంఘాలు మరియు గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులపై ప్రదర్శించాల్సి ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ప్రజలకు అందుబాటులో ఉంచలేదని తెలిపారు. దీనిపై అధికారులను సంప్రదించినప్పటికీ సరైన స్పందన లభించలేదని పేర్కొన్నారు.ప్రస్తుత చేనేత సంఘాల అధ్యక్షులతో అధికారులు కుమ్మక్కై పాత పాలకవర్గాన్నే కొనసాగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. సభ్యత్వం ఉన్న 150 మందిలో వాటా చెల్లింపులను కారణంగా చూపించి, తమకు అనుకూలంగా ఓటరు జాబితాను మార్చుతున్నారని అన్నారు. మరణించిన వారి పేర్ల స్థానంలో తమకు అనుకూల వ్యక్తులను చేర్చడం, చైర్మన్ కుటుంబ సభ్యులకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి అక్రమాలు జరుగుతున్నాయని వెల్లడించారు.నాబార్డ్ మరియు ఇతర పథకాల ద్వారా వచ్చిన నిధుల దుర్వినియోగం బయటపడకుండా ఉండేందుకు కొత్త సభ్యులను అడ్డుకుంటున్నారని విమర్శించారు. గతంలో జియో ట్యాగ్ నమోదులో కూడా ఇదే విధంగా అక్రమాలు జరిగాయని గుర్తు చేశారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మరియు జౌళి శాఖ అధికారులు స్పందించి, ఓటరు జాబితాలో జరిగిన అక్రమాలను సరిదిద్దాలని, టోల్ ఫ్రీ నెంబర్ ప్రకటించి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని దాసరి బిక్షపతి డిమాండ్ చేశారు.



# కాళేశ్వరంప్రాజెక్టుపైకూలిన ప్రభుత్వ కుట్రలు

### హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్న బిఆర్ఎస్ మల్లంపల్లి మండల యూత్ అధ్యక్షుడు మొర్రిరాజుయాదవ్

**మల్లంపల్లి మండల ప్రతినిధి ఏప్రిల్ 24 (పి సి డబ్ల్యూ న్యూస్):** పీసీఘోష్ కాళేశ్వరం పై ఇచ్చిననివేదిక ఆధారంగా తెలంగాణరాష్ట్రాన్నిసాధించిన తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ మరియు మాజీమంత్రి హరీష్ రావు గారిపై ఎలాంటి చర్యలు చేపట్టవద్దని హైకోర్టు ఇచ్చిన తీర్పును బిఆర్ఎస్ పార్టీ తరఫున స్వాగతిస్తున్నామని మొర్రిరాజుయాదవ్ అన్నారు. ఈకాంగ్రెస్ ప్రభుత్వం కావాలనికెసిఆర్ ప్రతిష్ట దెబ్బతీయాలని దురుద్దేశంతో కక్షపూరితంగానే కాళేశ్వరం కూలేశ్వరంఅయిందని దుష్ప్రచారాలు చేసి 6గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పిప్రజలనుమోసం చేసి అధికారంలోకివచ్చారు కానీ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన కెసిఆర్ హరీష్ రావు లాంటి నాయకులను ఎన్నిఇబ్బందులకుగురిచేసిన న్యాయస్థానాల ముందు నిలువలేక పోతున్నాయి దానికినిదర్శనమే ఈరోజు పిసిఘోష్ నివేదిక హైకోర్టులో నిలబడలేకపోవడంఅని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల్లోవస్తున్న వ్యతిరేకతనుఇచ్చిన చూసి హామీలను అమలు చేయలేకనే ప్రజలను తప్పుదోవ పట్టించడం కోసం కాళేశ్వరంప్రాజెక్ట్ గూర్చి కెసిఆర్ పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు.



తెలంగాణ రాష్ట్రంఏర్పడితే నీళ్లురావు కరెంటురాదు అని అసెంబ్లీలో ఆనాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి ఆంధ్ర పాలిత నాయకులుఅవహేళన చేస్తే తెలంగాణ వచ్చుడో కెసిఆర్ సచ్చుడో అనేనినాదంతో రాష్ట్రాన్ని సాధించి బీడువారిని తెలంగాణను బంగారు తెలంగాణ దిశగా సస్యశ్యామలం చేసి రైతులకు 24 గంటల కరెంటు ఇచ్చి నీళ్లిచ్చి, రైతుబంధు,రైతుబీమా లాంటి అనేక పథకాలు పెట్టి రైతే రాజు అనేనినాదంతో రైతునురాజుగాచేసిన మహనీయుడు కేసీఆర్. అలాంటి నాయకుడు పై అబండాలేస్తూ బురద చల్లే ప్రయత్నం చేయడం చాలా దుర్మార్గం. ఆరోజు అసెంబ్లీ ఎలక్షన్లలో గెలువమని దురుద్దేశంతోనే కెసిఆర్ పై కాళేశ్వరం కూలిపోయిందని అబద్ధపు ప్రచారం చేసింది కాళేశ్వరం ప్రాజెక్ట్ లో మేడిగడ్డ ఒక భాగం మాత్రమే అందులో రెండుపిల్లర్లు కూలిపోతేగత రెండున్నర సంవత్సరాలుగా రిపేర్ చేయకుండా కెసిఆర్ పై అబాండాలు వేస్తూ కాలయాపనచేస్తుంది ఈకాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి ఉంటే ఎన్నడో మరమ్మత్తులుచేసేవారు కానీ మరమ్మత్తులుచేయకుండా కేసీఆర్ నుబదనంచేయడం కోసమే కాళేశ్వరంప్రాజెక్టు ఒకబూచిగాచూపెట్టే ప్రయత్నం చేస్తుందిఅనిఅన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటూరైతాంగ ప్రయోజనాలు కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసం చూస్తుంది ఈప్రభుత్వంఎన్నికుట్రలు బాధనాములుచేసినా కెసిఆర్ హరీష్ రావు, మా నాయకులను కుట్ర పూరితంగాఇరికించాలని చూసినా అవి కోర్టుల్లో నిలబడకపోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రజలు ఇది ప్రజా పాలన కాదు ప్రజలను వంచించిపబ్బంగడుపుకునే ప్రభుత్వమని ప్రజలు అనుకోవడం రాబోయేరోజుల్లో బిఆర్ఎస్ పార్టీ అధికారం లోకి రావడానికి సూచనలు అనిఅన్నారు. ఇప్పటికైనా ప్రజలను తప్పుదోవపట్టించే కుట్ర పూరిత చర్యలు మానుకుని ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కృషిచేయాలని కోరారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మొర్రిరాజు యాదవ్అన్నారు. మల్లంపల్లి టౌన్ ప్రెసిడెంట్ చీదర సంతోష్ మరియు జిల్లా యువజన విభాగం అధికార ప్రతినిధి రేణిగుంట్ల సురేష్ యువజన నాయకుడు మహమ్మద్ చోటు తదితరులు పాల్గొన్నారు

# ఆర్టీసీ కార్మికుల డిమాండ్‌లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి...



- ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి బాధాకరం..
- నగర మేయర్ కొలగని శ్రీనివాస్...

**కరీంనగర్,ఏప్రిల్24(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కరీంనగర్ లో శుక్రవారం రోజున ఆర్టీసీ జేఏసి కార్మికుల కు మద్దతు, సంఘీభావం ప్రకటించి, ఆర్టీసీ డిపో వద్ద కార్మికులతో కలిసి ఆంధోళన కార్యక్రమంలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు బస్టాండ్ నుండి కార్మికులతో కలిసి అమరవీరుల స్థూపం వరకు మేయర్ కొలగని శ్రీనివాస్ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మేయర్ విచారం వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం ప్రకటించారు. ఈ సంధర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్టీసిని ప్రభుత్వం లో విలీనం చేస్తూ కార్మీకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసి కార్మీకుల బకాయి ఉన్న వేతన సవరణలను వెంటనే అమలు చేయాలని చేయాలన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మీకులను పట్టించుకొక పోవడం వల్లే ఆత్మహత్యలు చేస్కోవల్సిన పరిస్తితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మీకులు చేస్తున్న న్యాయపోరాటానికి బీజేపి ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ మొండి వైఖరి వల్లే నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందడం జరిగిందని దీనికి ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలిపారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించి డిమాండ్ల నెరవేర్చాలన్నారు. ఆర్టీసీ కార్మీకుల పీఆర్సీని వెంటనే ప్రకటించాలన్నారు. ఆర్టీసీని బలోపేతం చేసేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు కొత్త బస్సులను కోనుగోలు చేయాలన్నారు. ప్రస్తుతం ఆర్టీసీ అద్దెబస్సులను నడుపుతూ కార్మీకులకు తీరని అన్యాయం చేస్తుందని వెంటనే నడిపిస్తున్న అద్దె బస్సులను తగ్గించాలన్నారు. 30 శాతం ఫిట్ మెంట్ తగ్గకుండా 2021 వేతన సవరణలను వెంటనే చేపట్టి ఆర్టీసీ జేఏసి కార్మీకులు తీస్కున్న సమ్మెను విరమింప చేయాలన్నారుఆర్టీసీ జేఏసి ప్రభుత్వం ముందు ఉంచిన 32 న్యాయమైన డిమాండ్ల పై కార్మీక సంఘాలతో సానుకూలంగా చర్చలు జరిపి వాటిని నెరవేర్చే దిశగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆర్టీసి సంస్థలో నూతన రిక్రూట్ మెంట్ చేపట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మీకుల హక్కుల కోసం పోరాటం చేసే వారికి మద్దతు తెలిపి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీస్కోవాలన్నారు. గుర్తింపు పొందిన కార్మీక సంఘాల యూనియన్లను వెంటనే ప్రారంబించాలన్నారు. యూనియన్ల ద్వారానే వారి సమస్యలు పరిష్కారం అవుతాయి కాబట్టి యూనియన్లతో ప్రభుత్వం చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ మొండి వైఖరిని వీడి సమ్మెలో ఉన్న 39 వేల మంది కార్మీకులతో తక్షణమే చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ప్రభుత్వం సానుకూలంగా చర్చలు జరపకుండా సమస్యలను పరిష్కరించ కుండా కార్మీకులను బెదింపులకు గురి చేయడం ముర్ఖత్వమని మండి పడ్డారు. ఇప్పటికైన చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సమ్మెను విరమింపజేసేలా చర్యలు తీస్కోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు చంద్ర, దేవసాని సరస్వతి, మాసం గణేష్, తోట అనిల్ మరియు ఆర్టీసీ యూనియన్ నాయకులు, కార్మీకులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపిన బీఎస్పీ



**హుజురాబాద్, ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** గత మూడు రోజులుగా ఆర్టీసీ కార్మికులు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వారి న్యాయమైన డిమాండ్ల కోసం చేస్తున్న సమ్మెకు హుజురాబాద్ నియోజకవర్గం లోని బహుజన్ సమాజ్ పార్టీ బిఎస్పి నాయకులు ఆర్టీసీ డిపో వద్ద దీక్షలో పాల్గొని సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ..రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన 32 డిమాండ్లలో ప్రధానంగా మూడు డిమాండ్లు ...ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఆర్టీసీ కార్మికులకు ఇవ్వవలసిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వరంగల్ జిల్లా నర్సంపేట్ డిపోలో గురువారం అమరుడైన ఆర్టీసీ కార్మికులు శంకర్ గౌడ్ మృతికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వంలో ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ దొడ్డే సమ్మయ్య, జిల్లా ఉపాధ్యక్షులు గిన్నారపు మహేందర్, హుజరాబాద్ నియోజకవర్గ ఇన్చార్జిలు వేల్పుల మల్లేష్, డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు) నియోజకవర్గ అధ్యక్షులు మంద సమ్మయ్య, ఎమ్మెల్యే ఎంపీ కంటెస్టెంట్ అభ్యర్థి మారపల్లి మొగిలయ్య, రామ్ శ్రీనివాస్, మొలుగూరి రమేష్, ఆకునూరి అచ్యుత్, మామిండ్ల మల్లయ్య యాదవ్, గంగారపు ప్రవీణ్, మీడియా/ సోషల్ మీడియా ఇన్చార్జ్ మంద జగన్ పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు భారతీయ మజూర్ సంఘం సంపూర్ణ మద్దతు



**పరకాల, ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):**పరకాల ఆర్టీసీ డిపో వద్ద కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెకు భారతీయ మజూర్ సంఘం రాష్ట్ర భవన కన్స్ట్రక్షన్ కార్యదర్శి అడ గాని జనార్దన్ రావు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులతో కలిసి నిరసనలో పాల్గొని వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కార్మికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, ఈ పరిస్థితుల్లో కొంతమంది కార్మికులు ఆత్మహత్య ప్రయత్నాలకు దిగడం, ఒకరు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను వెంటనే చర్చల ద్వారా పరిష్కరించి, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించాలని డిమాండ్ చేశారు.ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించడం అత్యవసరమని, కార్మికులు తమ హక్కుల కోసం యూనియన్లు ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వాలు కార్మికులను చిన్నచూపు చూడకూడదని, ప్రజలకు నిత్యం సేవలందించే కార్మికుల భద్రత, సంక్షేమం ప్రభుత్వ ప్రధాన బాధ్యతగా భావించాలని ఆయన అన్నారు. గతంలో కార్మికుల ఆగ్రహానికి ప్రభుత్వాలు కూలిపోయిన ఉదాహరణలు ఉన్నాయని గుర్తు చేస్తూ, ప్రస్తుత ప్రభుత్వం కూడా అలాంటి పరిస్థితులను తీసుకురావద్దని హెచ్చరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని భారతీయ మజూర్ సంఘం తరఫున డిమాండ్ చేశారు.

# ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి ప్రభుత్వ హత్యగా ఖండిస్తున్నాం

- ఆత్మహత్యలు కాదు... పోరాటంతోనే హక్కులు సాధించాలి: బీసీ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూరి శ్రీకాంత్ గౌడ్



**మల్లంపల్లి మండల ప్రతినిధి ఏప్రిల్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ గారి దుర్మరణం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, ఈ ఘటనను ప్రభుత్వ నిర్లక్ష్యం మరియు ఒత్తిడుల ఫలితంగా జరిగిన “ప్రభుత్వ హత్య”గా బీసీ జేఏసీ తీవ్రంగా ఖండిస్తుంది.ఆర్టీసీ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె బాట పట్టిన సందర్భంలో, ప్రభుత్వం స్పందించకపోవడం, సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం వల్లే ఇలాంటి దుర్ఘటనలు జరుగుతున్నాయి. ఇది కేవలం ఒక కుటుంబానికి జరిగిన నష్టం కాదు, మొత్తం కార్మిక వర్గానికి జరిగిన అన్యాయం.ఈ సందర్భంగా బీసీ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గారు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మహత్యలు చేసుకోకూడదని, సమస్యలపై ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రాణాలు కోల్పోవడం సమస్యకు పరిష్కారం కాదని, సంఘటిత శక్తితోనే న్యాయం సాధ్యమని స్పష్టం చేశారు.ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెకు బీసీ జేఏసీ పూర్తి మద్దతు తెలుపుతోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలిబాధిత కుటుంబానికి తగిన పరిహారం ఇవ్వాలిఇటువంటి ఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకోవాలిఅని డిమాండ్ చేస్తున్నాము.శంకర్ గౌడ్ గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము.

## చింతపల్లిలో చలివేంద్రంను ప్రారంభించిన సర్పంచ్ దీరవత్ వీరన్న నాయక్



**సీరోల్ ఏప్రిల్ 24(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండలం చింతపల్లి గ్రామ పంచాయతీ లో గ్రామ సర్పంచ్ దీరవత్ వీరన్న,ఉప సర్పంచ్ బద్రు చేతుల మీదుగా చలివేంద్రం ప్రారంభోత్సవం చేశారు.సర్పంచ్ వీరన్న మాట్లాడుతూ వేసవిలో ప్రయాణించే ప్రయాణికులకు అటు ఇటు వెళ్లే దారిలో నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నారని ప్రతి ఒక్కరికి దాహం తీర్చాలని ఈ చలివేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పంచాయతీ కార్యదర్శి లెనిన్, వార్డ్ మెంబర్లు భుక్య క్రిష్ణ, కొంపల్లి సతీష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు జరిపోతుల మహేష్, ఏఎన్ఎం జ్యోతి, గ్రామపంచాయతీ సిబ్బంది యమగాని వెంకన్న, మల్లిపాక మహేష్, మడ్డి వీరభద్రం, భూక్య వెంకన్న, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నర్సంపేట డ్రైవర్ మృతి పట్ల టీజీఎస్ ఆర్టీసీ వర్క్‌షాప్‌లో సంతాపం, నిరసన



**కరీంనగర్,ఏప్రిల్24(పిసిడబ్ల్యూ న్యూస్):**టీజీఎస్ ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్ కరీంనగర్‌లో జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో నర్సంపేటకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ కమిటీ చైర్మన్‌గా జి. ఆంజనేయులు, కన్వీనర్‌గా బి. సురేష్, ప్రభాకర్ వ్యవహరించగా, సభ్యులుగా జి. సత్యనారాయణ, బాడీ షాప్ నుంచి అశ్విన్ రెడ్డి, ఎలక్ట్రికల్ యూనిట్ సెక్షన్ నుంచి సాయికుమార్ కాజా, మెకానికల్ సెక్షన్ నుంచి ఎం. అంజయ్య, స్టోర్ యార్డ్ నుంచి ఏ. లచ్చయ్య, స్టోర్ నుంచి ఉమాశంకర్ పాల్గొన్నారు.వర్క్‌షాప్‌లోని అన్ని కేటగిరీల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులు అర్పించారు. అలాగే నిరసన కార్యక్రమం నిర్వహించి తమ ఆవేదన వ్యక్తం చేశారు.


## వడ్లు కొనుగోలు కేంద్రాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం





**గంగాధర ఏప్రిల్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం ఈ రోజు రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ దత్తోజిపేట గోపాల్ రావుపేట్ రామచంద్రాపూర్ రామడుగు కొరటపల్లి షానగర్ గ్రామాలలో వడ్ల కొనుగోలు ప్రారంభ కార్యక్రమంలో కరీంనగర్ DCC అధ్యక్షులు చొప్పదండి శాసన సభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం తో మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులతో కలిసి పాల్గొన్న కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నవెంకటరాం రెడ్డి.

## వెంకటేష్‌చందన దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు వెల్లువ



**కల్లూరు, ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):**మున్సిపాలిటీ పరిధిలోని పుల్లయ్య బంజర గ్రామానికి చెందిన శివాలయం మాజీ చైర్మన్ మాడిశెట్టి వెంకటేష్, చందన దంపతులు 9 వసంతాలు విజయవంతంగా పూర్తిచేసుకుని పదో వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా వారికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్ట రాఘమయి దయానంద్ విజయకుమార్ ముఖ్య అనుచరులు, గ్రామ పెద్దలు, స్నేహితులు, కుటుంబ సభ్యులు దంపతులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.కల్లూరు శివాలయం మాజీ చైర్మన్‌గా సేవలందించిన మాడిశెట్టి వంశస్థులు అయిన వెంకటేష్, చందన దంపతులు కుటుంబ జీవితంలో పరస్పర అవగాహన, ప్రేమాభిమానాలతో ఆదర్శ దంపతులుగా నిలుస్తున్నారని పలువురు కొనియాడారు. సమాజంలో మంచి పేరు సంపాదించుకుంటూ కుటుంబ విలువలను కాపాడుతూ ముందుకు సాగుతున్న ఈ దంపతులు మరెన్నో వివాహ వార్షికోత్సవాలు ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.అదేవిధంగా, వెంకటేష్ శివాలయం చైర్మన్‌గా పనిచేసిన సమయంలో ఆలయంలో జరిగే పూజా కార్యక్రమాలు, ఉత్సవాలు, సేవా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ భక్తుల ప్రశంసలు పొందారని తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేసి, స్థానిక ప్రజలను ధార్మిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేసిన వ్యక్తిగా ఆయనకు మంచి పేరు ఉందని గ్రామస్తులు గుర్తుచేశారు. సమాజ సేవలోనూ చురుకుగా పాల్గొంటూ గ్రామ అభివృద్ధికి తోడ్పడుతున్నారని పేర్కొన్నారు.ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు కలిసి జీవించాలని మనస్ఫూర్తిగా కోరుతూ, దేవుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ మీపై ఉండాలని పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబంలో ఆనందోత్సాహ వాతావరణం నెలకొంది.

## మహబూబాబాద్ డిపో కార్మికులకు మద్దతు తెలిపిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



**మహబూబాబాద్ జిల్లా, ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):**ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలంటూ మహబూబాబాద్ డిపో కార్మికులకు మద్దతు తెలిపిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ హక్కుల కోసం ఉద్యమిస్తే.. ఉక్కుపాదంతో అణిచివేస్తరా..అధికారంలోకి రాకముందు చెప్పిందేమిటి. ఇప్పుడు చేస్తున్నదేమిటి.ఆర్టీసి కార్మికులు సమ్మె చేస్తున్నా, కనీసం సోయి లేని సర్కారు అంతులేని నిర్లక్ష్యం వల్లే ఇవాళ ఉద్యమం నాటి దృశ్యాలు, ఆత్మబలిదానాలు చేసుకునే పరిస్థితులు చూస్తున్నాం.ఆర్టీసి కార్మిక సోదరుల్లారా దయచేసి మనోధైర్యాన్ని కోల్పోకండి. మీ పోరాటాలకు బీఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందన్నీ మాజీ మంత్రి, సత్యవతి రాథోడ్ అన్నారు.

## రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యం... భాద్యతండాలో మహా ధర్నా ఘనంగా నిర్వహణ



**రఘునాధపాలెం, ఏప్రిల్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):**మండలం భాద్యతండా గ్రామంలో రైతుల హక్కుల సాధన కోసం నిర్వహించిన రైతు మహా ధర్నా శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు భారీగా హాజరై తమ ఐక్యతను చాటుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ నునవత్ పెంట్యా నాయక్ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపసర్పంచ్ నునవత్ రవి, మాజీ ఉపసర్పంచ్ భూక్య సుగుణ, గౌస్, ఎంపీటీసీ చందు నాయక్ తదితరులు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం అందరూ కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.అలాగే 5వ వార్డు సభ్యురాలు గుగులోత్ అరుణ, 7వ వార్డు సభ్యురాలు బానోత్ బేబీ, 8వ వార్డు సభ్యుడు మాలోత్ చందర్ పాల్గొని రైతుల సమస్యల పరిష్కారానికి తమ పూర్తి మద్దతు ప్రకటించారు.రైతుల హక్కుల సాధన కోసం నిర్వహించిన ఈ మహా ధర్నా గ్రామంలో ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. రైతుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.

## భాద్యతండాలో ఘనంగా జాతీయ పంచాయతీ దినోత్సవం

### ప్రజాస్వామ్యానికి పునాది గ్రామపంచాయతీ : సర్పంచ్ పెంట్యా నాయక్



**రఘునాధపాలెం, ఏప్రిల్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):**మండలం భాద్యతండా గ్రామంలో జాతీయ పంచాయతీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నునవత్ పెంట్యా నాయక్, ఉపసర్పంచ్ నునవత్ రవి, 5వ వార్డు సభ్యురాలు గుగులోత్ అరుణ, 7వ వార్డు సభ్యురాలు బానోత్ బేబీ, 8వ వార్డు సభ్యుడు మాలోత్ చందర్, 4వ వార్డు యూత్ లీడర్ తేజావత్ శరత్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ నునవత్ పెంట్యా నాయక్ మాట్లాడుతూ, గ్రామపంచాయతీ వ్యవస్థ ప్రజాస్వామ్యానికి పునాది వంటిదని తెలిపారు. గ్రామ స్థాయిలో పాలన బలంగా ఉంటేనే దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి ద్వారానే సమగ్ర దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు.పంచాయతీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ప్రతి పౌరుడి బాధ్యత అని, గ్రామాభివృద్ధిలో ప్రజలు చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

## మేడే ఎర్రజెండాలు ఎగురవేసి కార్మిక ఐక్యత చాటాలి

- సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి



**కురవి ఏప్రిల్ 24(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మేడే న ఎర్రజెండాలు గ్రామ గ్రామాన ఎగురవేసి కార్మిక ఐక్యత చాటాలనీ సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి పిలుపు నిచ్చారు సిపిఐ కొరవి మండల కౌన్సిల్ సమావేశం జరగగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దాసోహమై కార్మికుల బలి దానలతో సాధించుకున్న 44 రకాలకార్మిక చట్టాలు రద్దు చేసి, 4కోడ్ లు గా కుదించడం,నియంతృత్వ విదానాలతో శ్రమదోపిడీ చేస్తూ హక్కులు కాలరాయడం పై శ్రమజీవులు సంఘటితమై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఆర్ టి సి కార్మికులకు ఇచ్చిన హామీల ను నెరవేర్చకుండా రెండు సంవత్సరాలుగా తాత్పర్యం చేయడం వల్లనే ఈనాడు కార్మికులు పోరాట బాట పట్టి ఆత్మహత్యల వరకు వెళ్తున్నారని కాబట్టి క్షణమే వారి న్యాయమైన సమస్యలను పరిష్కారం చేసి ఆర్టీసీ కాపాడాలని డిమాండ్ చేశారు. మేడే సందర్భంగా అన్ని రంగాల కార్మిక సంఘాలు, గ్రామ శాఖలు ఎర్రజెండాలు ఎగురవేసి పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహించాలని పిలుపు నిచ్చారు ఈ సమావేశం లో సిపిఐ మండల సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య, కురవి టౌన్ కార్యదర్శి తురక రమేష్, బొల్లం ఉప్పలయ్య, దూదికట్ల సారయ్య, నిలిగొండ నాగేశ్వరరావు, సంగెం జిన్నీ పాల్గొన్నారు

## లారీ అసోసియేషన్ సమస్యలపై స్పందించిన ఎస్పీ



**మల్లంపల్లి మండల ప్రతినిధి ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా మల్లంపల్లి మండలానికి చెందిన లారీ అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లారీ యజమానులు మరియు డ్రైవర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు.వారి వినతిని శ్రద్ధగా విన్న ఎస్పీ, సమస్యలను సమగ్రంగా పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే లారీ రంగానికి సంబంధించిన సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్లంపల్లి మండల లారీ యూనియన్ ప్రెసిడెంట్ సునీల్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ములుగు లారీ ఆఫీస్ ప్రెసిడెంట్‌తో పాటు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఐఐటీలో నరేంద్ర విద్యార్థులకు గోల్డ్ మెడల్స్

### బ్రెయిన్ మ్యాపింగ్ అకాడమీ ఆధ్వర్యంలో మెడల్స్ అందజేత




**గంగాధర ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంగంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలోని నరేంద్ర విద్యాలయం హై స్కూల్ విద్యార్థులు ఐ ఐ టీలో గోల్డ్ మెడల్స్ సాధించినట్లు పాఠశాల యాజమాన్యం గంగాధర రాజేశం, గుజ్జుల గోపాల్ రెడ్డి తెలిపారు. బ్రెయిన్ మ్యాపింగ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐ ఐ టి కోర్సులో 6వ, 7వ తరగతి విద్యార్థులకు పాఠశాల స్థాయిలో కోచింగ్ ఇచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగా అకాడమీ సంస్థ ఆయా తరగతులకు టాలెంట్ పరీక్షలు నిర్వహించింది. ఇందులో భాగంగా 6వ తరగతిలో ఏ. మేఘన్, జీ. వాస్విక్, జ్.సాయిప్రతిష్ లు గోల్డ్ మెడల్స్ సాధించగా, 7వ తరగతిలో ఏ. అక్షిత, డి.సంజన, ఏ. అభిక్ లు గోల్డ్ మెడల్ సాదించారు. ఇట్టి విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో అందించారు.ఆర్. నిహాల్ గౌడ్ కు ప్రశంశ పత్రం అందించారు. మొదటి సరిగా 6వ 7వ తరగతులకు ప్రవేశ పెట్టిన ఐ ఐ టి కోర్సు లో గోల్డ్ మెడల్స్ సాధించడంపై పాఠశాల యజమాన్యం, తల్లితండ్రులు, అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. వచ్చే విద్యాసంవత్సరం మిగితా తరగతులకు ఐ ఐ టి కోర్సు తో పాటు అబకాస్, వేదిక్ మ్యాస్, డిజిటల్ తరగతులు ప్రవేశ పెట్టనున్నట్లు పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతంలో సాంకేతిక తో కూడిన విద్యను అందించడమే తమ లక్ష్యం అన్నారు. సబ్జెక్టు బోధకులు డి. కరుణాకర్, టి. అరుణ్, అధ్యాపకాబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## తిమ్మాపూర్‌లో మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు...



**తిమ్మాపూర్,ఏప్రిల్24(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని మత్స్యపారిశ్రామిక రామకృష్ణ కాలనీ గ్రామ మత్స్యపారిశ్రామిక సహకార లిమిటెడ్ సంఘం ఎన్నికలు శుక్రవారం సంబంధిత అధికారుల ఆదేశాల మేరకు నిర్వహించబడినట్లు ఎన్నికల అధికారి సాజిద్ తెలిపారు.ఈ ఎన్నికల్లో బోళ్ల శంకర్ చైర్మన్‌గా, రేగుల శ్రీనివాస్ ఉపాధ్యక్షుడిగా, దాసరి తిరుపతి కోశాధికారిగా ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా కోతి రాజ్ కుమార్, పండుగ శ్రీనివాస్, గంగు రాయమల్లు, కోతి మల్లేశం, గోనెల పర్శరాములు, గోనెల ఎల్లయ్యలు ఎన్నికైనట్లు వెల్లడించారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు ముదిరాజ్ సంఘ నాయకులు అభినందనలు తెలియజేశారు.

# నైపుణ్యాభివృద్ధితోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు

**నిరంతర సాధనతోనే విజయం సాధ్యం**

**సంకుచిత భావనలు విడిచి, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి:**

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**



**ములుగు ప్రతినిధి ఏప్రిల్24(పిసిడబ్ల్యూ న్యూస్):** యువత నైపుణ్యంలో అభివృద్ధి సాధిస్తేనే ఉజ్వల భవిష్యత్తు నిర్మించుకోగలరని, నిరంతర సాధనతోనే విజయం సిద్ధిస్తుందని, సంకుచిత భావనలను విస్మరించి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ జీవితంలో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. యువతకు దిశానిర్దేశం చేశారు.శుక్రవారం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవంలో జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణపై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.నిర్వహించారు.టాస్క్ సెంటర్, ఐటీడీఏ, డీఆర్డీఏ, ఎస్సీ కార్పొరేషన్, ఉద్యానవన శాఖల ద్వారా యువతకు అందుబాటులో ఉన్న శిక్షణ తరగతులు, ఉపాధి అవకాశాలపై సంబంధిత అధికారులు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ యువత నైపుణ్యాభివృద్ధితో ఉజ్వలమైన భవిష్యత్తుకు పునాదులు వేసుకోవచ్చని, సంకల్పంతో నిరంతరం సాధన చేస్తే విజయం తప్పనిసరిగా వరిస్తుందని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ జీవితంలో ముందుకు సాగాలని సూచించారు.ప్రత్యేకంగా ములుగు జిల్లాలోని యువతకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించేందుకు టాస్క్ సెంటర్‌ను ప్రారంభించామని, దీని ద్వారా యువత ఎంచుకున్న రంగాల్లో నైపుణ్యం సాధించేలా ఉచిత శిక్షణ అందించి ఉపాధి కల్పిస్తున్నామని స్పష్టం చేశారు.టాస్క్ సెంటర్ ఏర్పాటు చేసినప్పటి నుంచి 10 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేశామని, ఇందులో 250 మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయని పేర్కొన్నారు. యువత సమయాన్ని వృథా చేయకుండా ఏదైనా రంగంలో పనిచేయాలనే ఆసక్తి కలిగి ఉండాలని, ప్రభుత్వం అందించే ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన పథకాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలని తెలిపారు.ప్రతిభకు కష్టాలు, పేదరికం అవరోధం కాదని, ప్రతి సమస్యకూ పరిష్కారం ఉంటుందని, కష్టాలను, బాధలను అధిగమిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని యువతకు సూచించారు.అనంతరం ఐటీడీఏ ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, సంపత్ రావు, ఐటీడీఏ ఏపీవో కె. నాగోరావు, డీఆర్డీఓ చంద్రశేఖర్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ జనార్ధన్, ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు, ఎస్సీ డెవలప్‌మెంట్ ఈడీ ధర్మ నాయక్, డీఈఓ సిద్ధార్థ రెడ్డి, అడిషనల్ పీడీ శ్రీనివాసరావు, ఈ డిస్టిక్ మేనేజర్ దేవేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అక్రిడిటేయేషన్ కార్డుల మంజూరు

- సమాజానికి ఉపయోగపడే వార్తలు అందించి జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి
- అక్రిడిటేయేషన్ కార్డుల ప్రక్రియ పారదర్శకతతో పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్/జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్‌పర్సన్ స్నేహ శబరీష్





**మహబూబాబాద్ ఏప్రిల్ 24(పి.సి.డబ్ల్యూ న్యూస్):** జిల్లాలో 2026–2028 సంవత్సరానికి సంబందిచిన మీడియా అక్రిడిటేయేషన్ కార్డుల జారీ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్‌పర్సన్ స్నేహ శబరీష్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ, దరఖాస్తుల సంఖ్య, పరిశీలన విధానం గురించి డీపీఆర్ఓను అడిగి తెలుసుకున్నారు.ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన నిజమైన జర్నలిస్టులకే అక్రిడియేషన్ కార్డులు జారీ చేయాలని సూచించారు. వృత్తి ప్రమాణాలు, అనుభవం, సంస్థ గుర్తింపు వంటి అంశాలను ప్రామాణికంగా పరిగణించాలన్నారు.జిల్లాలో ఇప్పటివరకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల ద్వారా (447) ఆన్లైన్ దరఖాస్తులు వచ్చాయని, అట్టి దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి కార్డులు అందించాలని, ప్రజాస్వామ్యంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, బాధ్యతాయుతంగా నిజమైన సమాచారాన్ని ప్రజలకు అందించాలన్నారు. అక్రిడియేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, ప్రతి దశలో పారదర్శకత పాటించాలని తెలిపారు.ఈ సమావేశంలో. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, డీపీఆర్ఓ పి. రాజేంద్ర ప్రసాద్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు సి.హెచ్ శ్రీనివాస్, ఈరగాని బిక్షం, వేముల అయోధ్య రామయ్య, నవాబ్, , షేక్ అక్రం, ఎం.మోహన్ రెడ్డి, గాడిపెల్లి శ్రీహరి, ఉమ్మగాని మధు, ఉప్పల రంగ, సిబ్బంది రాము తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనక రైతులను వేధిస్తున్నది ఎవరు...?

- సర్పంచ్ నిరాహార దీక్షతో మండుతున్న కల్లూరు
- 20 రోజులు కేంద్రం.. ఒక్క బస్తా కొనుగోలు లేదు రైతుల ఆవేదన ఉప్పొంగింది
- ప్రభుత్వం మౌనం ఎందుకు..? అధికారులు స్పందించరా...?





**కల్లూరు, ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):**కల్లూరు మండలంలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతుల ఆవేదన ఉధృతమవుతోంది. గోకారం (ఎర్రబంజర) గ్రామపంచాయితీ పరిధిలో రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాన్ని తక్షణం స్పందింపజేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ సర్పంచ్ గుగులోత్ శ్రీను నిరాహార దీక్షకు దిగడం పరిస్థితి తీవ్రతను స్పష్టం చేస్తోంది.గత 40 రోజులుగా రైతులు తమ ధాన్యాన్ని ఆరబోసి కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ప్రారంభమై 20 రోజులు గడిచినా ఒక్క బస్తా కూడా కొనుగోలు చేయకపోవడం రైతుల్లో ఆగ్రహాన్ని రగిలిస్తోంది. కేంద్రం ఉందిడ అధికారులు ఉన్నారుడ కానీ కొనుగోలు మాత్రం లేదు. ఇది రైతులపై నిర్లక్ష్యమా? లేక వ్యవస్థ వైఫల్యమా..? అని రైతులు ప్రశ్నిస్తున్నారు.సర్పంచ్ గుగులోత్ శ్రీను మాట్లాడుతూ ధాన్యం కొనేవరకు నా నిరాహార దీక్ష కొనసాగుతుంది. రైతుల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. మేమంతా అప్పులు చేసి పంట పండించాం. ఇప్పుడు కొనకపోవడంతో ఆర్థికంగా కుదేలవుతున్నాం అని ఘాటుగా హెచ్చరించారు. ఆయన దీక్షకు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో మద్దతు తెలుపుతున్నారు.గ్రామంలో ఎండలో పడి ఉన్న ధాన్యం గుట్టలు, ఖాళీగా ఉన్న కొనుగోలు కేంద్రం, నిరాహార దీక్షలో కూర్చున్న సర్పంచ్ ఈ దృశ్యాలు అధికార యంత్రాంగం పనితీరుపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. రైతులు రోజురోజుకీ అప్పుల బారిన పడుతూ జీవనోపాధి కోసం తంటాలు పడుతున్నారు. ప్రభుత్వం రైతుల పట్ల ఇంత నిర్లక్ష్యం ఎందుకు చూపుతోంది...? కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి కూడా కొనుగోళ్లు చేయకపోవడం వెనుక అసలు కారణం ఏమిటి..? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని కొనుగోళ్లు ప్రారంభించకపోతే ఆందోళనలు మరింత తీవ్రరూపం దాల్చే అవకాశముంది. ప్రస్తుతం ఈ అంశం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. రైతుల కష్టానికి న్యాయం జరుగుతుందా..? లేక ఇదే పరిస్థితి కొనసాగుతుందా..? అన్నది ప్రభుత్వం తీసుకునే చర్యలపై ఆధారపడి ఉంది. వెంటనే స్పందించి రైతులకు ఉపశమనం కల్పించాలని ప్రజలు, రైతులు ఏకగ్రీవంగా డిమాండ్ చేస్తున్నారు.

# శ్రీసత్యసాయిసేవాసమితి ఆధ్వర్యంలో భగవాన్ శ్రీసత్యసాయిబాబావారి ఆరాధన మహోత్సవం

**నారాయణ సేవలో వందమందికి పులిహోర, స్వీట్ లు, మజ్జిగ ప్యాకెట్లు, అరటిపండ్లు పంపిణీ కార్యక్రమం: కురవి సమితి కన్వీనర్ సిహెచ్ శ్రీనివాస్**





**కురవి ఏప్రిల్ 24(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండలకేంద్రంలో శ్రీసత్యసాయిసేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన భగవాన్ శ్రీసత్యసాయిబాబావారి ఆరాధన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన నారాయణ సేవలో వందమందికి పులిహోర, స్వీట్ లు, మజ్జిగ ప్యాకెట్లు, అరటిపండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కురవి సమితి కన్వీనర్ సిహెచ్ శ్రీనివాస్, కురవి ప్రశాంతినిలయం వ్యవస్థాపక అధ్యక్షుడు గండేపల్లి తిరుమలరావు–లక్ష్మీ దంపతుల పర్యవేక్షణలో జరిగిన ఈ నారాయణసేవలో పాల్గొన్న కురవి శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామివారి ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ, ధర్మకర్త చిన్నం గణేష్, సేవాసమితి బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

# కార్మికుల డిమాండ్లను నెరవేర్చకుంటే ఉద్యమం తప్పదు



**సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హెచ్చరిక**

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆర్టీసీ కార్మికులు న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకుంటే మరో ఉద్యమం తప్పదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికుడు కోలా శంకర్ గౌడ్ మృతికి నిరసనగా సమ్మెలో మూడవరోజు నోటికి నల్ల రిబ్బన్ కట్టుకుని బస్ డిపో నుండి పాత బస్టాండ్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం మానవహారం చేపట్టి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి కోలా శంకర్ గౌడ్ కు నివాళు లర్పించారు.. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు మాట్లాడుతూ కార్మికులు ఇప్పటికి ఇప్పుడే అనుకుని సమ్మె నోటీసు ఇవ్వలేదని.. 41 రోజుల క్రితమే సమ్మె నోటీసు ఇచ్చారన్నారు. సమ్మె ప్రారంభించడానికి ముందు కార్మిక సంఘాలతో చర్చలు జరిపిన మంత్రులు మరో నాలుగు వారాలు సమయం కావాలని కోరటం సమంజసం కాదన్నారు. వీరు పెట్టిన డిమాండ్స్ కూడా కొత్తవేమీ కాదనీ గత మూడు సంవత్సరాల నుండి యాజమాన్యం, కార్మికులు, ప్రజల మధ్య నలుగుతున్న డిమాండ్లేన్నారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్మికుల సమస్యల పరిష్కరించకుండా దొంగ దారిన బస్సులు నడపాలని చూసినప్పుడు కొంతమంది కార్మికులు నిస్సాయతకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల ఎవరూ నిరాశ చెందవద్దని పోరాడి సాధించుకోవాలే కానీ ఆత్మహత్యలు పరిష్కారం కాదన్నారు. గతంలో జరిగిన 56 రోజుల పాటు జరిగిన సమ్మెలో సిపిఐ మొదటి రోజు నుండి చివరి వరకు కీలక పాత్ర పోషించిందనీ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఏడు రోజులపాటు ఆమరణ హారదీక్ష చేసి సమస్యకు పరిష్కారం చూపారన్నారు. ఈ సమ్మెలో కూడా సిపిఐ మద్దతు పూర్తిస్థాయిలో ఉంటుందని కార్మికులకు ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, పగడాల మల్లేష్, పిడిఎస్ యు జిల్లా నాయకులు మస్తాన్, జేఏసీ చైర్మన్ పిల్లి రమేష్, కన్వీనర్స్ బిఎస్ రెడ్డి, ఎన్. నాగయ్య, ఎల్.ఆర్.కే రావు, ఎంఆర్ నాథ్, పిట్టల సుధాకర్, జేఏసీ నాయకులు బేతంపూడి బుచ్చిబాబు, అనిత, రామలక్ష్మి, సుజాత, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు, మాధవరావు, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.




# హెల్మెట్ల పంపిణీ అవగాహన బైక్ ర్యాలీ నిర్వహణ







**చిట్యాల ఏప్రిల్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్ సేఫ్టీపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు "Arrive Alive" కార్యక్రమంలో భాగంగా చిట్యాల మండల పోలీసుల ఆధ్వర్యంలో గుంటూరుపల్లి గ్రామంలో హెల్మెట్ పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు , జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ హాజరయ్యారు. గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు కార్యక్రమంలో పాల్గొన్నారు. సాంస్కృతిక కళాబృందం రోడ్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే మరియు ఎస్పీ గారి చేతుల మీదుగా 100 హెల్మెట్లను పంపిణీ చేసి, రోడ్డు భద్రతపై పలు సూచనలు చేయడం జరిగింది. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించడం జరిగింది. అలాగే గ్రామ ప్రజలు "నో హెల్మెట్ నో ఎంట్రీ" అనే నినాదంతో ముందుకు రావడం జరిగిందని తెలిపారు.తదుపరి గుంటూరుపల్లి గ్రామం నుండి తిరుమలాపూర్ గ్రామం వరకు బైక్ ర్యాలీ నిర్వహించబడింది. ఈ ర్యాలీ ద్వారా ప్రజలకు రోడ్డు భద్రతపై సందేశాలు విస్తృతంగా చేరవేయడం జరిగింది. భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్, చిట్యాల ఎస్ఐ సతీష్,మొగుళ్లపల్లి ఎస్ఐ సురేష్, టేకుమట్ల ఎస్ఐ అమూల్య, ప్రజాప్రతినిధులు, యువకులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్లపై మోదీ సాహసోపేత నిర్ణయం

**నియోజకవర్గాల విభజనతో దక్షిణాదికి నష్టం లేదు**

**రిజర్వేషన్లపై కాంగ్రెస్ వైఖరి ఎప్పుడూ వ్యతిరేకమే**

**నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి**

**మీడియా సమావేశంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి**

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భారత ప్రజాస్వామ్య చరిత్రలో మహిళా సాధికారతకు బాటలు వేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నారీ శక్తి వందన్ అధినియం' (131వ రాజ్యాంగ సవరణ బిల్లు) ఒక సువర్ణ అధ్యాయమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కొనియాడారు. గత 27 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఈ అంశానికి మోదీ శాశ్వత పరిష్కారం చూపారని, దీనిని కేవలం రాజకీయ కోణంలో కాకుండా సామాజిక మార్పుగా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఖమ్మంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గాల పునర్విభజన, జనగణన ప్రక్రియల ద్వారానే మహిళలకు దక్కాల్సిన 33 శాతం రిజర్వేషన్లు క్షేత్రస్థాయిలో సంపూర్ణంగా అమలు కాగలవని సోదాహరణంగా వివరించారు. **పునర్విభజనతోనే మహిళా కోటాకు సంపూర్ణ న్యాయం :** మహిళా రిజర్వేషన్ బిల్లు లేదా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందడంపై ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, గతంలో తొమ్మిది సార్లు ఈ బిల్లు ప్రయత్నాలు జరిగినప్పటికీ చిత్తశుద్ధి లేకపోవడం వల్లే అవి చట్టం కాలేదని విమర్శించారు. ఈ బిల్లు అమలు అనేది జనగణన,నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలతో ముడిపడి ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న స్థానాలను తగ్గించకుండా, సీట్ల సంఖ్యను పెంచడం ద్వారానే పురుష సభ్యులకు అన్యాయం జరగకుండా మహిళలకు 33 శాతం ప్రాతినిధ్యం కల్పించవచ్చని, ఇందుకోసం డీలిమిటేషన్ తప్పనిసరి అని విశ్లేషించారు. పార్లమెంటులో ఈ బిల్లును దాదాపు అందరూ మద్దతు తెలపగా, కేవలం ఇద్దరు సభ్యులు (అసదుద్దీన్ ఒవైసీ, ఇంతియాజ్ జలీల్) మాత్రమే వ్యతిరేకించారని గుర్తు చేశారు. **దక్షిణాదికి అన్యాయమన్నది విపక్షాల అపోహే.. గణాంకాలతో పటాపంచలు** నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందన్న విమర్శలను కొండా విశ్వేశ్వర్ రెడ్డి గణాంకాలతో తిప్పికొట్టారు. గత చరిత్రను ఉదహరిస్తూ, కాంగ్రెస్ హయాంలో జరిగిన పునర్విభజనల సమయంలోనే దక్షిణ భారత్ సీట్ల కేటాయింపులో తీవ్రంగా నష్టపోయిందని నిరూపించారు. 1963లో జరిగిన రెండవ పునర్విభజనలో ఉత్తర భారత్‌కు 29 సీట్లు పెంచగా, దక్షిణ భారత్‌కు కేవలం 2 సీట్లు (నికరంగా) మాత్రమే పెంచారని, ఆంధ్రప్రదేశ్ మరియు తమిళనాడులో సీట్ల తగ్గింపు జరిగిందని ఎత్తిచూపారు. ప్రస్తుత హోం మంత్రి అమిత్ షా గారు పార్లమెంటులో చెప్పినట్లుగా ఏ ఒక్క రాష్ట్రానికి కూడా సీటు తగ్గదని, పైగా దక్షిణాది రాష్ట్రాలకు 0.1 నుండి 0.2 శాతం వరకు అదనపు ప్రయోజనమే కలుగుతుందని భరోసా ఇచ్చారు.ఓటర్ల పెరుగుదలను గమనిస్తే, నియోజకవర్గాల సంఖ్య పెరగడం అనివార్యమని ఎంపీ పేర్కొన్నారు. 1971లో ప్రతి ఎంపీకి సగటున 10 లక్షల మంది ఓటర్లు ఉండేవారు. ఉత్తరప్రదేశ్‌లో 10.03 లక్షలు, బీహార్‌లో 10.03 లక్షల మంది




ఓటర్లు ఉండేవారు. అయితే 2024 నాటికి ఈ సాంద్రత విపరీతంగా పెరిగింది. 2024 గణాంకాల ప్రకారం ఉత్తరప్రదేశ్‌లో ప్రతి ఎంపీకి 19.30 లక్షల మంది, తెలంగాణలో 19.50 లక్షల మంది, ఆంధ్రప్రదేశ్‌లో 16.60 లక్షల మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. ఈ అధిక ఓటరు సాంద్రతను దృష్టిలో ఉంచుకుని పునర్విభజన చేపడితే, తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 17 స్థానాలు 26 వరకు పెరిగే అవకాశం ఉందని విశ్లేషించారు. **రిజర్వేషన్లపై కాంగ్రెస్ చరిత్ర అంతా ద్వంద్వ వైఖరే :** రిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్ పార్టీ అనుసరించిన చారిత్రక ద్వంద్వ వైఖరిని ఆయన పత్రాల ద్వారా బట్టబయలు చేశారు. జవహర్ లాల్ నెహ్రూ 1961 జూన్ 27న ముఖ్యమంత్రులకు రాసిన లేఖలో, "నేను ఏ రకమైన రిజర్వేషన్లనైనా వ్యతిరేకిస్తాను... అవి అసమర్థతకు దారితీస్తాయి" అని పేర్కొన్నారని వెల్లడించారు. ఇందిరా గాంధీ ప్రభుత్వం 1980లో మండల్ కమిషన్ నివేదిక సమర్పించినప్పటికీ దానిని అమలు చేయలేదని ఆరోపించారు. రాజీవ్ గాంధీ 1990 సెప్టెంబర్ 6న లోక్‌సభలో మాట్లాడుతూ, ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లు ఇస్తే దేశంలో కుల యుద్ధాలు వస్తాయని హెచ్చరించిన విషయాన్ని ప్రస్తావించారు. నేడు రాహుల్ గాంధీ "జిత్నీ ఆబాదీ ఉత్నా హక్" అని నినదిస్తున్నప్పటికీ, జనాభా ప్రాతిపదికన జరిగే పునర్విభజన ప్రక్రియకు అడ్డుపడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. **పాతబస్తీలో 'జెర్రీమాండరింగ్'పై ధ్వజం :** హైదరాబాద్ నియోజకవర్గాల విభజనలో వివక్ష ఉందని ఆయన ఆరోపించారు. ముస్లిం మెజారిటీ ఉన్న ప్రాంతాలలో ప్రతి 20-25 వేల మందికి ఒక కార్పొరేటర్ డివిజన్ ఉంటే, హిందూ మెజారిటీ ప్రాంతాలలో 50 వేల మందికి ఒకే డివిజన్ ఉండటం జెర్రీమాండరింగ్ అక్రమాలకు నిదర్శనమని మండిపడ్డారు. ఇలాంటి అక్రమాలను సరిదిద్దడానికి శాస్త్రీయమైన డీలిమిటేషన్ అవసరమని పేర్కొన్నారు. విపక్షాలు క్రెడిట్ అంతా మోదీ కి పోతుందన్న భయంతోనే 'ధర్మ సంకటం' పేరిట నాటకాలు ఆడుతున్నాయని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి వాకదాని పుల్లారావు యాదవ్, రాష్ట్ర మహిళ నాయకులు దొడ్డా అరుణ, అత్తి విజయ రెడ్డి, అనిత, రజినీరెడ్డి, స్వర్ణకుమారి, మందా సరస్వతి, మనీ, ఫణి కుమారి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

---

## అక్రమ పశువధపై వచ్చిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలి

- **జీహెచ్ఎంసీని ఆదేశించిన హైకోర్టు**
- **తెలంగాణ గోశాల ఫెడరేషన్ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్**



**హైదరాబాద్, ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రేటర్ హైదరాబాద్ నగర పరిధిలో పశువుల అక్రమ రవాణా, పశు వధకు సంబంధించిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.శ్రవణ్ కుమార్ జీహెచ్ఎంసీ కమీషనర్, జీహెచ్ఎంసీ (చార్మినార్ జోన్) డిప్యూటీ కమీషనర్ ను ఆదేశించారని తెలంగాణ గోశాల ఫెడరేషన్ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ తెలిపారు. ఈ రిట్ పిటీషన్ ను తెలంగాణ గోశాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో దాఖలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం కాచిగూడ లోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ చట్టంలోని వివిధ నిబంధనలను అమలు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. జీహెచ్ఎంసీ నిబంధనల ప్రకారం... ఇబ్బంది కలిగించే విధంగా జంతువులను ఉంచడం, కమిషనర్ లిఖితపూర్వక అనుమతి లేకుండా మానవ వినియోగం కోసం పశువులను నగరంలోకి తీసుకురావడం నిషిద్ధమని అన్నారు. వేలాది పశువులను అనుమతి లేకుండా నగరంలోకి తీసుకువచ్చి అక్రమంగా వధిస్తున్నారని గోశాల ఫెడరేషన్ తరపున న్యాయవాది జివిఎల్ నరసింహారావు వాదించారని ఆయన పేర్కొన్నారు. పదేపదే విన్నవించుకున్నప్పటికీ, ముఖ్యంగా బక్రీద్ సమయంలో జీహెచ్ఎంసీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై ఒక సంక్షిప్త నివేదికను కోర్టు ముందు ఉంచాలని న్యాయమూర్తి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారని ఆయన తెలిపారు.

## పంచాయతీరాజ్ దినోత్సవం ను ఘనంగా జరుపుకన్న గ్రామపంచాయతీలు

**- అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు ఏర్పాటు.**

**- పారిశుద్ధ్యం , త్రాగునీరు,విద్యుత్ పై కొనసాగిన చర్చలు.**

**- స్థల నిర్ధారణ కోసం ఆగిన వారసంత.**





**తొర్రూర్ ప్రతినిధి,ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ అన్ని గ్రామ పంచాయతీలలో పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం గ్రామ సభలను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలంలోని గుర్తుర్ గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ వి, కవిత బాలకృష్ణ గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని కొందరు గ్రామ సమస్యలపై ప్రధానంగా పారిశుద్ధం మంచినీటి వసతి ,విద్యుత్ సమస్యలపై గ్రామ సర్పంచ్ మరియు కార్యదర్శి దృష్టికి తీసుకొచ్చారు. ఎస్సీ కాలనీలో గత కొన్ని నెలలుగా విద్యుత్ స్తంభం విరిగి ఇంటిపై పడే అవకాశాలు ఉన్నాయని గతంలో జరిగిన గ్రామసభలో విషయాన్ని సర్పంచికే కాకుండా ఎంపీడీవో దృష్టికి కూడా తీసుకువెళ్లారు. కాలనీవాసులకు భారీగా పొంచి ఉన్న భారీ ప్రమాదాన్ని ఈ గ్రామ సభలో విద్యుత్ అధికారులు దృష్టికి గ్రామ సర్పంచ్ కవిత బాలకృష్ణ మరోమారు వారికి గుర్తు చేశారు. ఇదే కాకుండా ఏపుగా పెరిగిన వృక్షాలన్నీ కరెంటు తీగలకు తగిలి మంటలు చెలరేగుతున్నాయని గతంలో చెప్పినప్పటికీ కూడా ఎవ్వరు పట్టించుకోవడం గాలి దుమారం వచ్చినప్పుడు విద్యుత్ తీగలలో మంటలు తెరరేగుతు న్నాయని గ్రామస్తులంతా భయాందోళనకు గురవుతు న్నారని వారికి గుర్తు చేశారు. గ్రామంలో పారిశుధ్యం కొట్టొచ్చునట్లుగా కనపడుతుందని దీనిపై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామంలో రెండు మినరల్ వాటర్ ప్లాంట్ ఉండగా అందులో ఒకటి క్లోరైడ్ నీరుగా గతంలోని గుర్తించారని అయినప్పటికీ కూడా అదే వాటర్ గ్రామస్తులు సేవిస్తున్నారని గ్రామంలో ఉన్న రెండు మినరల్ వాటర్ ప్లాంట్ లోని నీరును ల్యాబ్లో టెస్ట్ చేయాలని గ్రామస్తులు కోరారు దీనిపై స్పందించిన సర్పంచ్ గ్రామస్తుల కోరిక మేరకు తాగే నీరును ల్యాబ్ లలో టెస్ట్ చేయిస్తామని అన్నారు అలాగే గత మూడు వారాల నుండి గ్రామంలో వారసంత ఏర్పాటు చేస్తామని ప్రకటిస్తూనే ఉన్న విషయాన్ని కొందరు వారి దృష్టికి తీసుకురాగా గ్రామంలో స్థల నిర్ధారణ లేకపోవడంతో నిలిపివేయాల్సి వచ్చిందని వచ్చేవారం శుక్రవారం క్రీడా ప్రాంగణం ప్రాంతం అలాగే గుంజేటి ముసలమ్మ ప్రాంతంలో కూరగాయల సంత, పశు వులు, మేకల సంత ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకుంటామని పై అధికారుల దృష్టికి కూడా తీసుకు వెళ్లాల్సి ఉందని వారు పేర్కొన్నారు. గ్రామ సభలు నిర్వ హించేవారు సభ నిర్వహణ సమయంలో మైకులను ఏర్పాటు చేయకపోతే వృద్ధులకు అధికారులు మాట్లా డిన మాటలు ఏమి వినిపించడం లేదని కొందరు వృద్ధులు ఈ విషయాన్ని వారికి గుర్తు చేశారు.

## తెలంగాణ మున్సిపల్ స్వీపర్ అండ్ కామాటి వెల్ఫేర్ సోసైటీ యూనియన్ ముషీరాబాద్ అధ్యక్షునిగా సత్యనారాయణ



**హైదరాబాద్, ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపల్ స్వీపర్స్ అందిస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించి వారని పర్మినెంట్ చేయాలని తెలంగాణ మున్సిపల్ స్వీపర్ అండ్ కామాటి వెల్ఫేర్ అసోసియేసన్ రాష్ట్ర అధ్యక్షుడు గాలిపల్లి క్రిష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బి. ఇందిర డిమాండ్ చేశారు. కాచిగూడ లోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాచిగూడకు చెందిన ముత్యపాక సత్యనారాయణను ముషీరాబాద్ నియోజకవర్గం అధ్యక్షునిగా నియమిస్తూ నియామకపు పత్రాన్ని వారు అందజేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించే విధంగా కృషి చేయనున్నట్లు వారు తెలిపారు. మున్సిపల్ కార్మికులందరూ ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాటాలకు సిద్దం కావాలని వారు కోరారు.

## పర్వతనేని వేణుని పరామర్శించిన సండ్ర వెంకట వీరయ్య



**కల్లూరు, ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మంలోని శ్రీ సాయి రామ్ హాస్పిటల్‌లో సత్తుపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పర్వతనేని వేణు భుజానికి శస్త్రచికిత్స జరగగా, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న సండ్ర , వేణు కి ధైర్యం చెబుతూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ఆర్టీసీ పునరుద్ధరణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- కార్మికుల జీవితం అమూల్యం**

**- ఆత్మహత్యలు పరిష్కారం కాదు**

**- కార్మికులు సంయమనం పాటించాలి**

**- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్**

**- రైతు సంక్షేమం, ఆర్టీసీ అభివృద్ధి దిశగా ప్రభుత్వం దృఢచర్యలు**



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆర్టీసీ పునరుద్ధరణకు ప్రభుత్వ కట్టుబడి ఉందని, కార్మికుల జీవితం అమూల్యమైనదని, ఆత్మహత్యలు పరిష్కారం కాదని, కార్మికులు సంయమనం పాటించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో శుక్రవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ భావోద్వేగంగా మాట్లాడారు. ఒకప్పుడు తీవ్ర ఆర్థిక, పరిపాలనా ఇబ్బందులతో నడిచిన టీజీఎస్ ఆర్టీసీ, నేడు ప్రభుత్వ సహకారం, కార్మికుల అంకితభావంతో తిరిగి బలమైన రవాణా వ్యవస్థగా ఎదిగిందని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు కష్టకాలాన్ని ఎదుర్కొంటున్న ఈ సమయంలో సంయమనం పాటించాలని, ఆత్మహత్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ సమస్యలకు పరిష్కారం కాదని హితవు పలికారు. ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన శంకర్ గౌడ్ మృతిపై ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబానికి సానుభూతి తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆధ్వర్యంలో కమిటీ పనిచేస్తోందని, త్వరలోనే శాశ్వత పరిష్కార మార్గాలు వెలువడతాయని భరోసా ఇచ్చారు.రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పదవిలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ ఆర్థిక స్థితి మెరుగుపడిందని, ఉద్యోగ భద్రత, నియామకాలు, కొత్త బస్సులు, వేతనాలు, బకాయిల చెల్లింపులు వంటి అంశాల్లో స్పష్టమైన పురోగతి కనిపిస్తోందన్నారు. ఉద్యోగుల సంక్షేమం, ఆరోగ్యం, భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని చెప్పారు. ఇక నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ... మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. గతంలో జరిగిన భూకబ్జాలు, వివాదాల నేపథ్యంలో నైతిక విలువల గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదని విమర్శించారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని అన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రైతుల పక్షాన బిఆర్ఎస్ నాయకులు ధర్నాలు చేయడం విచిత్రమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో వరి, మొక్కజొన్న దిగుబడులు రికార్డు స్థాయిలో వచ్చాయని, రైతులు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి, రైతు పండించిన ప్రతి గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని తెలిపారు. ఇప్పటికే 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, మరో రెండు లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొని, ప్రభుత్వ చర్యలకు మద్దతు ప్రకటిస్తూ, ప్రజా సంక్షేమం పట్ల కట్టుబాటును పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, పీసీసీ సభ్యులు జిల్లా ఓబీసీ సెల్ అద్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, మహి ళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్, నగర ఓబిసి సెల్ అద్యక్షులు బాణాల లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్, నగర కమిటీ సభ్యులు పాలకుర్తి నాగేశ్వర రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, జిల్లా అధికార ప్రతినిధి కల్వకుంట్ల గోపాల్, జిల్లా కార్యదర్శులు మూడుమూంతల గంగారాజు యాదవ్, చింతమల్ల రవి, ఫతే అహ్మద్, నగర కాంగ్రెస్ కమిటి అధికార ప్రతినిధి ఏలూరి శ్రీనివాస్, నగర కాంగ్రెస్ కమిటి సభ్యులు సంపటం నరసింహారావు, కోనేటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి రూ. 1కోటి ఎక్స్ గ్రెసియా ఇవ్వాలి**

**శివసేన పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ గణేష్ గౌటే**



**హైదరాబాద్, ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని శివసేన పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ గణేష్ గౌటే రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెలో భాగంగా ఆర్టీసీ ముషీరాబాద్ బస్ డిపో వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నదని డాక్టర్ గణేష్ గౌటే తీవ్రంగా విమర్శించారు. ఆర్టీసీ సమ్మెను పరిష్కరించాల్సింది పోయి కమిటీల పేరుతో కాలయాపన చేయడం ద్వారా ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసిందన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన పోరుబాట చివరకు సమ్మెకు దారితీసి, రాష్ట్రంలో పరిస్థితిని ఆందోళనకరంగా మార్చిందని పేర్కొన్నారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ముగ్గురు ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడడం ఎంతో కలచివేసే విషయం. ముఖ్యంగా ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ఆత్మహత్యాయత్నం చేసిన వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముత్తోజిపేటకు చెందిన డ్రైవర్ కోల శంకర్ గౌడ్ చికిత్స పొందుతూ మరణించడం అత్యంత బాధాకరమని అన్నారు. కాంగ్రెస్ సర్కారు ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చకపోవడం, సమస్యలను పరిష్కరించకపోవడం వల్లే ఈ దారుణ పరిస్థితి ఎదురైందన్నారు. శంకర్ గౌడ్ మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆయన కుటుంబానికి ఒక కోటి రూపాయలు పరిహారం చెల్లించాలని, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. దీనితోపాటు, ఆర్టీసీ కార్మికులు ముందుగానే ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చినా కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో కూడా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కార్మికులు సమ్మెకు దిగినప్పుడు శివసేన పార్టీ కార్మికుల పక్షాన నిలబడి పోరాటం చేసిందని ఆయన గుర్తు చేశారు. అదే విధంగా, 2017 నుంచి ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ బకాయిలు చెల్లించకపోవడం, రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన బెనిఫిట్స్ ఇవ్వకపోవడం కూడా ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇలాంటి చర్యలు ఇప్పటికే అమలు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలి. కార్మికుల ఆత్మహత్యలకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి. ఆర్టీసీ కార్మికులకు శివసేన పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోంది. వారి హక్కుల కోసం మేము పోరాటం కొనసాగిస్తున్నాం, కొనసాగిస్తూనే ఉంటాం. ఆర్టీసీ కార్మికుల పక్షాన శివసేన ఎల్లప్పుడూ నిలుస్తుంది. తెలంగాణ సమాజం మొత్తం కూడా ఈ పోరాటంలో కార్మికుల పక్షాన నిలుస్తోంది. అయితే, ఈ సందర్భంగా నేను ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్నాను.. ఎవరూ కూడా ఆత్మహత్యలకు పాల్పడవద్దు. మీ సమస్యల పరిష్కారం కోసం శివసేన పోరాటం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో శివసేన పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాష్ట్ర కోర్టు మెంబర్ డాక్టర్ గణేష్ గౌటే, అధికార ప్రతినిధి మహేష్ కుమార్, బీసీ చైర్మన్ దాస్ సురేష్, సరస్వతి, గోపాల్, శంకర్ మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొని ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం తెలపడం జరిగింది.

# హుజూరాబాద్ డంపింగ్ యార్డు వివాదం: నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం

**● బండి సంజయ్ హెచ్చరిక...**





**హుజూరాబాద్, ఏప్రిల్ 24 (పీసీడబ్ల్యూ న్యూస్):** హుజూరాబాద్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయంపై రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, వెంటనే నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఆందోళన కార్యక్రమంలో మాట్లాడుతూ, డంపింగ్ యార్డు ఏర్పాటును కొనసాగిస్తే పెద్దఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యానికి, పరిసరాల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి సమీపంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని, తాగునీరు కాలుష్యమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం అమలు అయితే స్థానిక ప్రజల జీవన పరిస్థితులు దెబ్బతింటాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరారు. ప్రజా పోరాటాలతో పాటు న్యాయపరమైన చర్యలు కూడా చేపడతామని, మానవ హక్కుల కమిషన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్లను ఆశ్రయించనున్నట్లు తెలిపారు. త్వరలో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్లు వెల్లడించారు. హుజూరాబాద్ ప్రజలు మరియు అన్ని వర్గాల నేతలు ఈ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని బీజేపీ నేతలు పిలుపునిచ్చారు. పరిస్థితులు మారకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# కల్లూరులో ఉచిత మజ్జిగ పంపిణీ

**● వడదెబ్బ నివారణకు ప్రయాణికులకు చల్లని సేవ ఆదర్శ దంపతులు మాడిశెట్టి వెంకటేష్, చందన**





**కల్లూరు, ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో పుల్లయ్య బంజర గ్రామానికి చెందిన, అందరికీ సుపరిచితులు మరియు కల్లూరు శివాలయం మాజీ చైర్మన్ మాడిశెట్టి వెంకటేష్, చందన దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని సేవా కార్యక్రమంతో గుర్తుండేలా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, కల్లూరు బస్టాండ్‌లో ప్రయాణికులు మరియు ఆర్టీసీ సిబ్బందికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. వడదెబ్బ నుండి ఉపశమనం పొందేందుకు చల్లని మజ్జిగను అందించడం ద్వారా ఈ దంపతులు తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమాన్ని చూసిన ప్రయాణికులు, స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ దంపతుల సేవా గుణాన్ని అభినందించారు. టీం సత్తుపల్లి తరపున, ప్రయాణికుల తరపున, కల్లూరు ప్రజల తరపున మాడిశెట్టి వెంకటేష్‌చందన దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని ఆకాంక్షించారు. ఉచితంగా మజ్జిగ పంపిణీ చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

**- అధికారులకు కవ్వంపల్లి హుకూం**



**తిమ్మాపూర్, ఏప్రిల్24(పీసీడబ్ల్యూ న్యూస్):** వేసవిలో తాగు, సాగు నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా నివారణ చర్యలు సత్వరమే చేపట్టాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులను కోరారు. శుక్రవారం ఎల్ఎండి కాలనీలోని ప్రజా భవన్‌లో ఆయన మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మానకొండూరు నియోజకవర్గం పరిధిలో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న తాగు, సాగు నీటి సమస్యల గురించి అధికారులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ వచ్చే మే మాసంలో ఎండలు మరింత తీవ్రతరమై నీటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పైపు లీకేజీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నీరు వృధా పోకుండా లీకేజీల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు నీటి ఎద్దడి కలగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు. ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ పర్యవేక్షక ఇంజనీర్, ఈఈలు, డీఈలు, ఎంపీడీవోలు తదితర అధికారులు పాల్గొన్నారు.

**మహాత్మా నగర్‌లో గృహప్రవేశానికి ఎమ్మెల్యే హాజరు**





తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ గ్రామంలో బొప్పు వనిత - సంపత్ దంపతులు ఇందిరమ్మ ఇంటికి శుక్రవారం గృహప్రవేశం జరుపుకోగా, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వారిని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్హోత్రా, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బండారి రమేష్, మహాత్మా నగర్ గ్రామ సర్పంచ్ పొన్నాల సంపత్, ఉప సర్పంచ్ కేతిరెడ్డి ఎల్లారెడ్డి, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు కుంట రాజేందర్ రెడ్డి, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, కనకమల్లు, ఎండి అంకూస్, చంద్రమౌళి, అల్లాడి రఘు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆడబిడ్డకు అండగా ఉందాం: నీలంతాయి

**● యువత రాజకీయాల్లోకి రావాలి ● తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులు ● కవిత ఆధ్వర్యంలో అందరికీ న్యాయం**



**హైదరాబాద్ ఏప్రిల్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** హరి బౌలి డివిజన్ లో సోను బాయ్ ఆధ్వర్యంలో ఇంటింటి బొట్టు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహారాష్ట్ర మరాఠీ సంఘం అధ్యక్షురాలు నీలం తాయి విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావాలని తెలంగాణ ఆడబిడ్డ కవిత కు మనమందరం అండదండగా ఉండాలని, తాను పెట్టబోయే పార్టీలో యువత చేరడానికి ఎంతోమంది సంప్రదింపులు జరుపుతున్నారని రానున్న రోజుల్లో తెలంగాణలో రాజకీయాల్లో రెండు మార్పులు సంభవిస్తాయని రేపు పార్టీ ప్రకటన తర్వాత రాజకీయాల్లో పెను మార్పులు సంభవిస్తాయని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో మీనా భాయ్ గగ్వర్, పద్మ గైక్వాడ్, అనిల్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అంశాలపై సబ్ కలెక్టర్ సమీక్ష

**- పెండింగ్ వ్యవహారాలపై ప్రత్యేక దృష్టి ప్రజలకు వేగవంతమైన సేవలందించాలంటూ ఆదేశాలు**



**పెనుబల్లి, ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ వివిధ రెవెన్యూ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ స్లాట్లు, భూభారతి కార్యక్రమం, రెవెన్యూ సదస్సులు, ప్రజల నుంచి అందిన ఫిర్యాదు వినతి పత్రాలు, మీ సేవా సర్టిఫికెట్లు, ఎన్నికలకు సంబంధించిన క్లెయిమ్ లు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. సంబంధిత అధికారులతో చర్చించి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో, సమర్థవంతంగా అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని పారదర్శకంగా పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సబ్ కలెక్టర్ సూచించారు.

# తుమ్మలపల్లిమండాలపాడు పిపిసి కేంద్రాల తనిఖీ

**● కొనుగోలు ప్రక్రియపై సబ్ కలెక్టర్ సమీక్ష ● రైతులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో సేవలు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు**



**పెనుబల్లి, ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండలంలోని తుమ్మలపల్లి, మండాలపాడు గ్రామాలలో ఉన్న పిపిసి కేంద్రాలను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాలను సందర్శించిన ఆయన, రైతులు మరియు కేంద్ర ఇన్‌చార్జీలతో ప్రత్యక్షంగా మాట్లాడి మిల్లర్ ట్యాగింగ్ ప్రక్రియ, గన్నీ బ్యాగుల సరఫరా, ధాన్యం కొనుగోలు విధానం తదితర అంశాలపై సమగ్రంగా విచారణ చేశారు. కేంద్రాల్లో జరుగుతున్న కార్యకలాపాలను సమీక్షిస్తూ, ఎటువంటి అవాంతరాలు లేకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలను సమయానికి కల్పించాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి, పారదర్శకంగా కొనుగోలు నిర్వహించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ తెలియజేశారు.

PCW తెలుగు దినపత్రిక

శనివారం 25 ఏప్రిల్ 2026

# ఆర్టీసీ ఆస్తులు 'మెగా' పరం దుర్మార్గం..?

### ప్రైవేటీకరణ కుట్రలు ఆపాలి

### కార్మికులకు బీజేపీ అండగా ఉంటుంది

### సమ్మె శిబిరంలో రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేస్తున్న సమ్మెకు భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని బీజేపీ నాయకులు, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు తో కలసి ఖమ్మం ఆర్టీసీ డిపో వద్ద సమ్మె చేస్తున్న కార్మికులకు ఆయన స్వయంగా వెళ్లి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల తీరుపై ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వాలు మారినా ఆర్టీసీ కార్మికుల తలరాతలు మారలేదని, సంస్థను ప్రైవేటీకరించే కుట్రలు ముమ్మరంగా సాగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 1930ల నాటి నిజాం కాలం నుంచి అద్భుతమైన రవాణా వ్యవస్థగా, లాభాల్లో నడిచిన ఏకైక ప్రభుత్వ సంస్థ ఆర్టీసీ అని కొండా గుర్తుచేశారు. బంగారు గుడ్లు పెట్టే బాతు లాంటి ఆర్టీసీని గత కేసీఆర్ ప్రభుత్వం నాశనం చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబ పాలన అంతమొందడంతో ఆర్టీసీ కష్టాలు తీరుతాయని కార్మికులతో పాటు తాము కూడా ఆశించామని, కానీ ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆర్టీసీని మరింత దిగజార్చుతోందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆర్టీసీ సమస్యలపై గొంతెత్తిన రేవంత్ రెడ్డి, జేఏసీ కోదండరామ్ లాంటి నాయకులు ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన సూటిగా ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని మియాపూర్ బస్ డిపో వద్ద ఉన్న సుమారు 50 ఎకరాల విలువైన ఆర్టీసీ భూములను ఎలక్ట్రిక్ బస్సుల ఛార్జింగ్ స్టేషన్ల పేరుతో ప్రైవేట్ సంస్థ అయిన 'మెగా' కృష్ణా రెడ్డికి అప్పగించడం దారుణమని ఆయన ఆరోపించారు. పర్యావరణ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ఒక్కో ఎలక్ట్రిక్ బస్సు కొనుగోలుకు రూ. 55 లక్షల భారీ సబ్సిడీ ఇస్తోందని, ఆ నిధులను ఉపయోగించి ఆర్టీసీయే స్వయంగా బస్సులను కొనుగోలు చేసి నడపాలి తప్ప, దాన్ని ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీశారు. ఇతర రాష్ట్రాల్లో ఆర్టీసీలే ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతున్నాయని గుర్తుచేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అనేది కాంగ్రెస్ ప్రభుత్వ పథకమని, దానికి సంబంధించిన పూర్తి ఆర్థిక భారాన్ని ప్రభుత్వమే భరించాలి తప్ప, ఆ ఖర్చును ఆర్టీసీ నెత్తిన రుద్దడం చట్టవిరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు లాంటి వారు ఇక్కడే ఉన్నా.. ఆర్టీసీ కార్మికుల సమ్మెను, వారి సమస్యలను ఏమాత్రం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రయాణికుల ప్రాణాలను సురక్షితంగా గమ్యం చేర్చడం కోసం గుండెపోటు వచ్చినా స్టీరింగ్ వదలకుండా ప్రాణాలు అర్పించిన గొప్ప నిబద్ధత ఆర్టీసీ డ్రైవర్ల సొంతమని ఆయన కొనియాడారు. కార్మికులు అధైర్యపడవద్దని, వారు తమ న్యాయమైన డిమాండ్లు సాధించుకునే వరకు బీజేపీ అండగా నిలబడి పోరాడుతుందని కొండా విశ్వేశ్వర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి వాకదానీ పుల్లారావు యాదవ్, మందడపు సుబ్బారావు, మేకల నాగేందర్, గుత్తా వెంకటేశ్వర్లు, వేరెల్లి రాజేష్, రవి రాథోడ్, నకరికంటి వీరభద్రం, రవి గౌడ్, ధనియాకుల వెంకటనారాయణ, బోయినపల్లి చంద్రశేఖర్, బోయినపల్లి సురేష్, కందుల శ్రీకృష్ణ, గుత్తా వంశీ పాల్గొన్నారు.

---

## 26న సీరోల్ కళ్యాణ మండపంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు

- సీరోల్ మండల అధ్యక్షులు ప్రతాపని పుల్లయ్య

**మహబూబాబాద్ జిల్లా సీరోల్ ఏప్రిల్ 24(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రంలో ఈ నెల 26 వ తేదీన ఆదివారం 10 గంటలకు కళ్యాణ మండపంలోశ్రీ వాసవి మాతా జయంతిని, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వము ఈ వేడుకలు అధికారం గా నిర్వహిస్తుందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపినారు. ఈ సందర్భంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి చిత్ర పటానికి ,పాలాభిషేకం,చేసి అనంతరం కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలకు మన ఆర్యవైశ్య సోదరులందరూ తప్పక సకాలంలో హాజరు అయ్యి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని పెద్ద ఎత్తున విజయవంతం చేయగలరని సీరోల్ మండల అధ్యక్షులు ప్రతాపని పుల్లయ్య తెలిపారు.

## పోలీసుల ఆధీనంలో తొర్రూర్ బస్ డిపో...

- అవాంఛనీయ సంఘటన జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు.
- డిపో ప్రాంతంలో కనిపించని ఆర్టీసీ ఉద్యోగులు.
- ప్రయాణికుల లేక బోసిపోయిన తొర్రూర్ ఆర్టీసీ బస్టాండ్.
- సూర్యాపేట ,ఖమ్మం బస్సులు మాత్రమే తిరిగాయి.





**తొర్రూరు ప్రతినిధి,ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 22వ తేదీ నుండి సమ్మెకు పిలుపునిచ్చిన ఆర్టీసీ జేఏసీ పిలుపుమేరకు అన్ని డిపోల బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి. సమ్మె తలపెట్టిన రెండవ రోజు ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట డిపోకు చెందిన శంకర్ గౌడ్ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషయం అందరికీ విధితమే. గురువారం రాత్రి శంకర్ గౌడ్ మృతి చెందడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా జేఏసీ పిలుపుమేరకు జిల్లాలోని తొమ్మిది డిపోల బస్సులు డిపో నుండి బయటికి రాకుండా ఉద్యోగస్తులంతా డిపోల ముందు బైఠాయించారు. నర్సంపేట డిపో డ్రైవర్ మృతుడు శంకర్ గౌడ్ కి అన్ని విధాల ప్రభుత్వ ఆదుకోవాలని ప్రభుత్వం వైఫల్యం వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్లు కొందరు పేర్కొన్నారు?. మధ్యాహ్నం వరకు ఆర్టీసీ బస్టాండ్ లో ఒక్క బస్సు కూడా రాకపోవడం దానికి తోడు ప్రయాణికులు ఎవరు లేక బోసిపోయినట్లుగా కనిపించింది బస్టాండ్ ప్రాంతంలో కూడా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. డిపో ముందు తొర్రూర్ ఎస్సై ఉపేందర్ తో పాటు మరికొందరు ఎస్సైలు పోలీసులు, సి ఆర్ పి సిబ్బంది బస్ డిపో ముందు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. తొర్రూర్ బస్టాండ్ లో బస్సులకు బదులుగా భారీగా ప్రైవేటు వాహనాలు ఆటోలు ఇదే ఆదరణగా అదనపు చార్జీలు వసూలు చేస్తూ బస్టాండ్ లోనే ఆటో స్టాండ్ లాగా ఏర్పాటు చేసుకున్నారు. ప్రయాణికులు కొందరు ప్రభుత్వం ,ఆర్టీసీ జేఏసీ నాయకులతో త్వరగా చర్చలు నిర్వహించి బస్సులు నడిపే విధంగా చూడాలని కోరుతున్నారు పాఠశాలలకు సెలవు దినం ప్రకటించినప్పటికీ ఎటు వెళ్లలేని పరిస్థితి ఉన్నదని పెళ్లిళ్ల సమయం కావడంతో ఇటు వెళ్లాలన్న బస్సులు లేక ప్రైవేటు వాహనాలలో తిరిగే స్తోమత లేక ఇంటి వద్దని ఉండాల్సిన పరిస్థితి నెలకొంటుందని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఏదో ఒక నిర్ణయం తీసుకొని బస్సులను నడిపించాలని కోరుతున్నారు.



---

## అభివృద్ధి అడుగుల్లో అన్నారుగూడెం

### మూడు నెలల్లోనే 20 లక్షలు వ్యయంతో అభివృద్ధి పనులు

### పదవీ కాలంలో మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతా

### గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్





**తల్లాడ, ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తల్లాడ మండలంలో అన్నారుగూడెం గ్రామం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుంది. ఈ మూడు నెలల కాలంలోనే సుమారు 20 లక్షల రూపాయలకు పైగా వ్యయంతో గ్రామంలో మారుమూల వీధులకు కూడా సీసీ లింకు రోడ్లు నిర్మించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ మాట్లాడుతూ నా రాజకీయ గురువు తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, మా ఉప సర్పంచ్, సీనియర్ నాయకులు కొమ్మినేని వెంకటేశ్వరరావుల సలహాలు, సూచనలతో గ్రామాన్ని మరింత అభివృద్ధి దిశగా నడిపిస్తానని మూడు నెలల కాలంలోనే ప్రతి మారుమూల రోడ్డును కూడా సీసీలతో నిర్మించామని తెలిపారు. మట్టి రోడ్డు లేని గ్రామంగా చెయ్యాలన్నదే ప్రధాన అజెండాగా పెట్టుకున్నామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామంలో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలతో నిత్యం గ్రామ సుపరిపాలనే ప్రధాన ధ్యేయంగా మా పంచాయతీ పాలకవర్గం పనిచేస్తుందని ఆయన తెలిపారు. గ్రామంలో ప్రతి పౌరుడు స్వేచ్ఛ, సమానత్వంతో ఉండాలన్నదే సంకల్పమని, అందుకు సహకరిస్తున్న పాలకవర్గానికి, ప్రతిపక్షానికి నాయకులకు, అధికారులకు, ప్రజలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సంపూర్ణ గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఈ సందర్భంగా సర్పంచ్ ప్రభాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో పలు అంశాలపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. అనంతరం సర్పంచ్ నేతృత్వంలో మౌలిక వసతుల కల్పనకై ఒక పటిష్టమైన యాక్షన్ ప్లాన్ తయారు చేశారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు,స్థానిక సర్పంచ్ గొడ్ల ప్రభాకర్,ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వరరావు,వార్డు మెంబర్స్, పంచాయతీ సెక్రెటరీ వెంకటేశ్వరరావు,స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు,ప్రజలు, అన్ని విభాగాల అధికారులు,అధికార సహసిబ్బంది,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

---

## హనుమకొండ, కాకతీయ ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి), ఆంగ్ల విభాగం విలియం షేక్‌స్పియర్ జన్మ, వర్ధంతి







**హనుమకొండ : ఏప్రిల్ 24 (పిసి డబ్ల్యూ న్యూస్):** హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి), ఆంగ్ల విభాగం, ప్రఖ్యాత నాటక రచయిత విలియం షేక్స్పియర్ జన్మ, వర్ధంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 23న పలు అర్థవంతమైన విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించింది. ఆంగ్ల భాషా దినోత్సవం సందర్భంగా, ఈ విభాగం విలియం షేక్స్పియర్ సాహిత్య కృషిపై జాతీయ స్థాయి ఆన్‌లైన్ ప్రశ్నోత్తర పోటీను నిర్వహించింది. ఇందులో దేశవ్యాప్తంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ అధ్యాపక బృందం విజ్ఞానదాయకమైన ఉపన్యాసాలు ఇచ్చింది. ఆంగ్ల విభాగ అధిపతి ప్రొఫెసర్ ఎ. శ్రీనాథ్, షేక్స్పియర్ యొక్క ముఖ్యమైన నాటకాలు, వాటి శాశ్వత ప్రాసంగికత గురించి మాట్లాడారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.ఎస్. ప్రవీణ్ కుమార్, షేక్స్పియర్ రచనలలో మానవ స్వభావాన్ని అసాధారణంగా చిత్రించిన తీరు శతాబ్దాల తర్వాత కూడా విశ్వవ్యాప్త ఆకర్షణను కలిగి ఉందని పేర్కొన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఇ. రామ్ భాస్కర్ రాజు, షేక్స్పియర్ యొక్క విషాద, హాస్య మరియు విషాద–హాస్య నాటకాల నుండి శక్తివంతమైన ఉదాహరణలను ఉటంకిస్తూ, ఆయన గొప్పతనంపై సవివరంగా ఉపన్యాసం ఇచ్చారు. విద్యార్థులు పుష్పగుచ్ఛాలు సమర్పించి, పఠనాలతో "ఏవాన్ కవి"కి హృదయ పూర్వక నివాళులర్పించారు. ఆంగ్ల సహాయ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. రమేష్ చంద్ర శ్రీకాంత్ లాంఛన ప్రాయంగా వందన సమర్పణ చేసి కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమానికి ఆంగ్ల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పాల్కుర్తి దినకర్, సహాయ ప్రొఫెసర్లు శ్రీ పి. జయకర్, శ్రీమతి బి. కిరణ్మయి, డాక్టర్ జి. రాజేష్‌లతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు హనీఫ్, ఇమ్రాన్, వర్షిణి, శ్రావ్య, రాజు, రష్మిక, మహేష్ మరియు అధ్యాపక బృందం హాజరై కార్యక్రమాన్ని చక్కగా ముగించారు. ఈ కార్యక్రమం షేక్స్పియర్ యొక్క కాలాతీత సాహిత్యం పట్ల మరింత ప్రశంసను విజయవంతంగా పెంపొందించింది మరియు విద్యార్థులలో సాహిత్య నైపుణ్యాన్ని ప్రోత్సహించాలనే విభాగం యొక్క నిబద్ధతను బలపరిచింది.

---

## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీఎస్పీ మద్దతు




**పరకాల, ఏప్రిల్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆర్టీసీ కార్మికుల సమ్మెలో భాగంగా పరకాల ఆర్‌టీసీ డిపో దగ్గర చేపట్టిన సమ్మెకు మద్దతుగా బహుజన్ సమాజ్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది.రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆర్టీసీ కార్మికుల సమ్మె జాక్ చైర్మన్ సూరన్న ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఎస్పీ జిల్లా ఇన్చార్జి శనిగరపు రాజు హాజరై మాట్లాడుతూ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన ఆర్టీసీ కార్మికుల సమస్యలను తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు , ఆర్టీసీ కార్మికులకు బీఎస్పీ పార్టీ అండగా ఉంటుందని ఆత్మహత్యలు చేసుకోవద్దని రాజు కోరారు అలాగే ఆర్టీసీ కార్మికుల ప్రధానమైనటువంటి డిమాండు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని బహుజన సమాజ్ పార్టీ డిమాండ్ చేస్తుంది అలాగే తెలంగాణ ప్రభుత్వం ఎత్తివేసిన ఆర్టీసీ కార్మికుల యూనియన్ లను వెంటనే పునరుద్ధరించి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు ఆర్టీసీనీ ప్రభుత్వం నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వం పావులు కదుపుతుందని అదే జరిగితే బీఎస్పీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా శనిగరపు రాజు డిమాండ్ చేశారు. పరకాల ఆర్ టీ సీ కార్మికులు బీఎస్పీ పరకాల నియోజకవర్గం ఇంచార్జి కర్రె రమేష్ అశోక్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.